# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 27-5-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:226 పేజీలు:6 వెల: రూ.1/-


**నేటి కందం-నేటికి అందం**

రాణించెడి భారతమున
కాననమగు జయపురమ్ము నా(గా కోటన్
జ్ఞానిగ తిలకించుచు నభి
మానము గురిపించినాడు మార్కో రూబ్యో !!

(అమెరికా స్టేట్ సెక్రటరీ మార్కో రూబ్యో మన దేశంలోని ఆగ్రా జైపూర్ లను సందర్శించి చాలా గొప్పగా మన భారత సంస్కృతిని పురాతన కట్టడాలను కొనియాడారు)



-రాధశ్రీ
సెల్:9494481210

**చురక**

వినసొంపే ఏమున్నది
వికసించని భారతం
అభివృద్ధి నినాదాలే
అగుపించని మారుతం.
సమస్యలు బాధలు
సామాన్యుల వేదనలు
పుష్కర కాలంగా కేంద్ర
పరిపాలన సాధనలు.



-వేల్పుల నారాయణ
9440433475

## లొంగిపోయిన మావోయిస్టు దంపతులు.. చెక్కులు అందజేసిన డీజీపీ



హైదరాబాద్, మే 26: మావోయిస్టు పార్టీలో నాలుగున్నర దశాబ్దాల పాటు పసునూరి నరహరి అలియాస్ సంతోష్ పని చేశారని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో మీడియా ఎదుట నరహరితోపాటు ఆయన భార్య ధనమ్మను తెలంగాణ పోలీసులు ప్రవేశపెట్టారు. లొంగిపోయిన వారిద్దరికి రూ. 25 లక్షలు, రూ.20 లక్షలు చొప్పున డీజీపీ చెక్కులు అందజేశారు. అనంతరం డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా 47 మంది మావోయిస్టులు ఇంకా అజ్ఞాతంలో ఉన్నట్లు గుర్తించామన్నారు. అందులో తెలంగాణాకి చెందిన వారు ముగ్గురు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు ఒకరు, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారు 15, జార్ఖండ్ 13, ఒడిశాకు చెందిన 15 మంది ఇంకా అజ్ఞాతంలో ఉన్నారని వివరించారు.

2024 నుండి ఇప్పటి వరకు 822 మంది మావోయిస్టులు లొంగిపోయారని పేర్కొన్నారు. మొత్తం 334 ఆయుధాలతో వీరంతా తెలంగాణా పోలీసులు ఎదుట లొంగిపోయారని చెప్పారు. ఇక తెలంగాణా పోలీసులు ముందు లొంగిపోయిన ఒడిశాకి చెందిన మావోయిస్టులను ఆ రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించామని పేర్కొన్నారు. మన రాష్ట్రానికి చెందిన మావోయిస్టులను త్వరలో వారి ప్రాంతాలకు వెళ్లి స్వయంగా కలుస్తానని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు.

తెలంగాణాకు చెందిన కేంద్ర కమిటీ సభ్యుడు ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతితోపాటు జాడే రత్న బాయి అలియాస్ సుజాత, వార్త శేఖర్ అలియాస్ మంగు లొంగిపోవాలని ఈ సందర్భంగా వారికి డీజీపీ సీవీ ఆనంద్ విజ్ఞప్తి చేశారు. వీరు లొంగిపోతే ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని బెనిఫిట్స్‌తోపాటు సదుపాయాలు కల్పిస్తామని అజ్ఞాతంతో ఉన్న మావోయిస్టులకు డీజీపీ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

మే 12వ తేదీన పోలీసుల ఎదుట నరహరి, ఆయన భార్య లొంగిపోయారు. వారిని ఈ రోజు మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. 2026, మార్చి 31వ తేదీ నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలించేందుకు కేంద్రం ఆపరేషన్ కగార్ చేపట్టింది. ఈ సందర్భంగా వందల సంఖ్యలో మావోయిస్టులు ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. అలాగే పలువురు మావోయిస్టులను అరెస్ట్ చేశారు. మావోయిస్టుల ప్రాబల్యం అధికంగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో భద్రతా దళాలు నిరంతరాయంగా చేపట్టిన కూంబింగ్ కారణంగా భారీ సంఖ్యలో మావోయిస్టులు మరణించారు. ఇక ప్రభుత్వం ఎదుట లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వం ప్రకటించిన రివార్డులు అందజేశారు. దీంతో దేశంలో దాదాపుగా మావోయిస్టు పార్టీ ప్రాబల్యం దాదాపుగా తగ్గిపోయింది.

## డ్రగ్స్ కేసులో కీలక మలుపు.. సిట్ ముందు హాజరైన అభిషేక్ సింగ్, రాకేశ్‌వర్మ

హైదరాబాద్, మే 26: బీఆర్ఎస్ తాండూరు మాజీ ఎమ్మెల్యే పంజుగుల రోహిత్ రెడ్డికి చెందిన మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ పార్టీ కేసు దర్యాప్తులో పోలీసులు వేగం పెంచారు. ఈ కేసును విచారిస్తున్న సిట్ అధికారులు డ్రగ్స్ సరఫరాకు సంబంధించిన మూడు ప్రధాన మార్గాలను గుర్తించారు. ఈ వ్యవహారంలో పలువురు డ్రగ్స్ సప్లయర్లు కూడా ఉన్నారని సిట్ అధికారులు తెలిపారు. పరారీలో ఉన్న అభిషేక్ సింగ్, రాకేశ్ వర్మలను ఇటీవల సిట్ అధికారులు విచారించిన విషయం తెలిసిందే. వీరిద్దరూ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించి కొన్ని రోజుల పాటు సిట్ విచారణ నుంచి ఉపశమనం పొందారు. అనంతరం, హైకోర్టు ఆదేశాల మేరకు సిట్ అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు. ఈ విచారణలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి.

పోలీసుల విచారణ సందర్భంగా రాకేశ్ వర్మ గత డిసెంబర్‌లో ముంబైకి చెందిన మజార్ అనే వ్యక్తి నుంచి కొకైన్ కొనుగోలు చేసినట్లు అంగీకరించాడు. అనంతరం ఆ డ్రగ్స్‌ను కౌశిక్ రవికి అందించినట్లు సిట్‌కు తెలిపాడు. బహదూర్‌పురాలో బ్యాటరీ వ్యాపారం నిర్వహిస్తున్న రాకేశ్ వర్మకు, ఇంటీరియర్ వర్క్స్ కారణంగా అభిషేక్ సింగ్‌తో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో ఫాం హౌస్ పార్టీకి ముందు అభిషేక్ సింగ్‌కు ఒక డ్రగ్స్ పార్సిల్ అందజేసినట్లు కూడా రాకేశ్‌వర్మ పోలీసుల విచారణలో ఒప్పుకున్నాడు. మరోవైపు గోవా నుంచి ఎండీఎంఏ డ్రగ్స్ సరఫరా చేసినట్లు అనుమానిస్తున్న క్లింటన్ అనే వ్యక్తి ఇంకా పరారీలోనే ఉన్నాడు. అతని కోసం పోలీసులు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నారు.

ఈ కేసులో గన్‌షాట్ ఘటన కూడా కీలకంగా మారింది. నమిత్ శర్మ చేతులకు అంటుకున్న గన్ పౌడర్ ఆనవాళ్లను ఫోరెన్సిక్ పరీక్షలకు సిట్ అధికారులు పంపించారు. ఈ పరీక్షలు పాజిటివ్‌గా వచ్చాయి. దీంతో పార్టీ సమయంలో కాల్పులు జరిగినట్లు పోలీసులు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ కేసులో అరెస్టయిన ముగ్గురు నిందితులు బెయిల్‌పై విడుదలయ్యారు. అయితే డ్రగ్స్ సరఫరా నెట్‌వర్క్, పార్టీ నిర్వహణ, కాల్పుల ఘటనలపై సిట్ అధికారులు మరింత సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నారు.

## మహిళలను సంపద సృష్టించే శక్తిగా తీర్చిదిద్దుతున్నాం: మంత్రి సీతక్క



హైదరాబాద్, మే 26: మహిళలను సంపద సృష్టించే శక్తిగా తీర్చిదిద్దుతున్నామని తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. మహిళల ఆదాయం పెరిగితే కుటుంబం బలపడుతుందని పేర్కొన్నారు. ఈరోజు (మంగళవారం) బంజారాహిల్స్‌లో సఖి నివాస్ వర్కింగ్ ఉమెన్ హాస్టల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మంత్రి సీతక్క హాజరై మాట్లాడారు. జూన్ 5వ తేదీన మహిళలకు సీఎం రేవంత్‌రెడ్డి ఆర్టీసీ బస్సులు అందజేస్తారని తెలిపారు. మహిళా సంఘాల సోలార్ ప్లాంట్లను రేపు (బుధవారం) డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క మధిరలో ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

మహిళల ఉన్నతే తెలంగాణ ప్రగతి అని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. వర్కింగ్ ఉమెన్స్ భద్రత తమ ప్రభుత్వ బాధ్యత అని తెలిపారు. గ్రామీణ మహిళలకు హైదరాబాద్‌లో సురక్షిత వసతి కల్పిస్తున్నామని చెప్పుకొచ్చారు. సఖి నివాస్‌లో 150 మంది మహిళలకు వసతి సౌకర్యం కల్పిస్తున్నామని వివరించారు. చిన్నపిల్లలతో వచ్చే తల్లులకు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నామని వెల్లడించారు. మహిళల భద్రత, వారి గౌరవానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణ పరిమితి పెంచుతున్నట్లు మంత్రి సీతక్క పేర్కొన్నారు.

## హైదరాబాద్‌లో కొత్తగా మరో జీసీసీ కేంద్రం

హైదరాబాద్, మే 26: నగరంలో కొత్తగా మరో గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్(జీసీసీ) కేంద్రం ఏర్పాటు కానుంది. రీజెనరాన్.. తొలి విదేశీ జీసీసీకి తెలంగాణ ఎంపిక అయింది. మంగళవారం హైదరాబాద్‌లో పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతో రీజెనరాన్ ప్రతినిధులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వీరి మధ్య ఒప్పందం ఖరారైంది. హైదరాబాద్‌ను గ్లోబల్ హబ్‌గా రీజెనరాన్ అభివృద్ధి చేయనుంది. క్లినికల్ ట్రయల్స్, ఏఐ, డేటా సైన్స్ సేవలను జీసీసీ అందించనుంది. దీంతో తెలంగాణలో గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ల సంఖ్య 450కి చేరనుంది.

జీసీసీల కేంద్రంగా దేశంలో హైదరాబాద్ రెండో స్థానంలో నిలిచింది. దీని ద్వారా బయోటెక్, ఏఐ రంగాల్లో హైదరాబాద్‌కు ఆదరణ పెరుగుతున్నట్లు స్పష్టమవుతోంది. జీనోమ్ వ్యాలీ విస్తరణతో లైఫ్ సైన్సెస్‌కు మరింత బలం చేకూరనుంది. గ్రీన్ ఫార్మా సిటీతో కొత్త పెట్టుబడులకు ఊతం ఇచ్చినట్లు అవుతోంది. రీజెనరాన్ జీసీసీ ఏర్పాటుతో భారీగా ఉద్యోగావకాశాలు రానున్నాయి. రీజెనరాన్ పెట్టుబడితో తెలంగాణ ప్రతిష్ఠను మరింత పెంచినట్లు అయింది.

## ఎంజీయూ అకాడమిక్ సెనెట్ సమావేశంలో కీలక నిర్ణయాలకు ఆమోదం

**-త్వరంలో పీహెచ్ఎ నోటీఫికేషన్, ఫార్మస్సీ, లా తోపాటు పలు యూజీ, పీజీ కోర్సుల సిలబస్ ఆమోదం**
**-నూతన కోర్సులు ఎంఏ ఉర్దూ, ఎంఈడీ, ఎంపీఈడీల అనుమతికై ప్రభుత్వానికి ఉన్నత విద్యా మండలికి ప్రతిపాదనలు**
**- 2026-27 విద్యా సంవత్సరం వర్సిటీ బడ్జెట్, బ్యాక్‌లాగ్ వన్ టైం పరీక్షల నిర్వహణకై ఆమోదం**




నల్గొండ, మే 26:నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ అకాడమిక్ సెనెట్ సమావేశం మంగళవారం వర్సిటీ సమావేశం మందిరంలో నిర్వహించారు. యూనివర్సిటీ అభివృద్ధితో పాటు నూతన కోర్సులు, సిలబస్, బడ్జెట్, పీహెచ్ఎ నూతన రూల్స్ పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. తొలుత గత వారంలో మరణించిన ఎంజీయూ విద్యావిభాగం డీన్ ప్రొ.ఎ.రామకృష్ణకు శ్రద్ధంజలి ఘటించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం వీసీ ప్రొ.ఖాజా అల్తఫ్ హుస్సేన్ మాట్లాడుతూ.. యూనివర్సిటీలో అత్యంత నాణ్యత ప్రమాణాలతో విద్యార్థులకు మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యభోధన సాగుతుందని తెలిపారు. అదేవిధంగా విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బందికి విజయవంతంగా బయోమెట్రిక్ హాజరు అమలు, హాజరు ఆధారంగానే వర్సిటీ క్యాంపస్ కళాశాలలో చదివే విద్యార్థులకు పరీక్షల ఫీజుల అనుమతి, ఇతర అంశాలను అమలు చేస్తున్నామన్నారు. విద్యార్థుల సౌకర్యంకై నూతన హాస్టల్స్ నిర్మాణం, అదే విధంగా పరిపాలన భవనం నిర్మాణం ఇతర అంశాలను వెల్లడించారు.

ఈ విద్యా సంవత్సరం నుండి యూనివర్సిటీలో ఫార్మస్సీ, లా కళాశాలలు ప్రారంభిస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ, ఉన్నత విద్యామండలి ఆదేశాలను అమలు చేస్తూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికై చర్యలు తీసుకుంటు ముందుకు సాగుతన్నట్లు తెలిపారు. యూనివర్సిటీ అభివృద్ధికై వర్సిటీ తొలి విశ్రాంత వీసీ ప్రొ.గంగాధర్‌రావు, మాజీ వీసీలు కట్టా నర్సింహారెడ్డి, భాగ్యనారాయణ మాట్లాడి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయా అంశాలపై చర్చ చేసి ఆమోదించారు. ఈ కార్యక్రమంలో ఎంజీయూ రిజిస్ట్రార్ ప్రొ.కొప్పుల అంజిరెడ్డి, ఆడిట్ సెల్ డైరెక్టర్ డా.వై.ప్రశాంతి, సీఓఈ డా.జి.ఉపేందర్‌రెడ్డి, వివిధ విభాగాల డీన్స్ ప్రొ.ఆకుల రవి, ప్రొ.అల్వాల రవి, రేఖ, అన్నపూర్ణబుట్టి, సెనెట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆమోదించిన అంశాలు..

-బ్యాక్‌లాగ్ యూజీ, పీజీ, బీఈడీ ఇతర కోర్సులకు వన్‌టైం పరీక్షల నిర్వహణ

- నూతన కోర్సులైన ఫార్మస్సీ, లా తోపాటు ప్రస్తుతం నిర్వహిస్తున్న యూజీ, పీజీ కోర్సుల సిలబస్ ఆమోదం

- నూతన పీహెచ్ రూల్స్, అడ్మిషన్లకై నోఫికేషన్ విడుదల

- యూనివర్సిటీ లో నూతనంగా ప్రవేశపెట్టే ఎంఏ ఉర్దూ, ఎంఈడీ, ఎంపీఈడీ కోర్సుల నిర్వహణకై ప్రభుత్వానికి, ఉన్నత విద్యామండలికి ప్రతిపాదనలు

-యూనివర్సిటీ 2026- 27 విద్యా సం. డ్రాఫ్ట్ బడ్జెట్ బడ్జెట్ రూ.40 కోట్లపైనే ఆమోదం తదితర అంశాలను చర్చించారు.

## అరుదైన ఖనిజాలు, లోహాలపై ఇండియా-అమెరికా మధ్య కీలక ఒప్పందం..

న్యూ ఢిల్లీ, మే 26: ఇండియా-అమెరికా మధ్య అరుదైన ఖనిజాలు, లోహాల సరఫరాపై కీలక ఒప్పందం కుదిరింది. క్రిటికల్ మినరల్స్, రేర్ ఎర్త్ సప్లైలపై వ్యూహాత్మక ముందడుగు పడింది. ఈ విషయంలో ఇరు దేశాలు ఎలా ముందుకెళ్లాలి అనే అంశంపై ఒక ఫ్రేమ్‌వర్క్ కుదుర్చుకున్నాయి. ప్రస్తుతం ఢిల్లీలో క్వాడ్ దేశాల విదేశాంగ మంత్రుల సమావేశం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ సదస్సు కోసం ప్రస్తుతం అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియెా ఇండియాలోనే ఉన్నారు. మార్కో రుబియెాతో భారత విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్ జైశంకర్ సమావేశమయ్యారు.

తాజాగా క్రిటికల్ మినరల్స్‌పై ఒక ప్రాథమిక ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందం వల్ల చైనాపై ఆధారపడాల్సిన అవసరం తప్పుతుంది. ఎందుకంటే క్రిటికల్ మినరల్స్ సరఫరాలో ప్రపంచం ఎక్కువగా చైనాపైనే ఆధారపడుతోంది. ఇప్పుడు ఈ విషయంలో అమెరికా, ఇండియా ఒకదానికి ఒకటి సహకరించుకుంటే పరస్పరం లబ్ధి పొందవచ్చు. దీనివల్ల ఆధునిక సాంకేతికత, క్లీన్ ఎనర్జీ, రక్షణరంగ ఉత్పత్తుల తయారీకి అవసరమైన ముడి సరుకు కోసం చైనాపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుంది. ఈ ఒప్పందం ద్వారా మైనింగ్, ప్రాసెసింగ్, పెట్టుబడులు, రీసైక్లింగ్ వంటి వాటిలో ఇరు దేశాలు కలిసి పని చేస్తాయి. సాంకేతికతను పంచుకుంటాయి.

భూమిలో అరుదుగా లభించే ఖనిజాలు, ఇతర ముడి పదార్థాలను క్రిటికల్ మినరల్స్, రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ అంటారు. ఈ ముడి సరుకు ద్వారానే ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల్లో వాడే సెమీ కండక్టర్లు, ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీలు, సోలార్ ప్యానెళ్లు, టెలీ కమ్యూనికేషన్ ఎక్విప్‌మెంట్, ఫైటర్ జెట్లు, ఏఐ నిర్మాణ సామగ్రి వంటివి తయారు చేస్తారు. ప్రస్తుతం ప్రపంచం అంతా టెక్నాలజీపైనే ఆధారపడుతోంది. ఈ నేపథ్యంలో క్రిటికల్ మినరల్స్ చాలా ముఖ్యం. వీటి లభ్యతలో చైనా ముందుంది. ఈ మార్కెట్‌లో చైనా ఆధిపత్యం కొనసాగుతోంది. అందుకే చైనాకు చెక్ పెట్టేందుకు ఇండియా-అమెరికా పరస్పరం సహకరించుకోవడం అవసరం.

## అక్రమ వలసలపై హైలెవల్ కమిటీ ఏర్పాటు.. అమిత్ షా ఆదేశం

న్యూ ఢిల్లీ, మే 26:దేశంలో జనాభాలో వస్తున్న అనవసర మార్పులు, అక్రమ వలసలపై అధ్యయనం చేసేందుకు ఒక హైలెవల్ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. ఈ అంశంపై ఎక్స్ వేదికగా మంగళవారం అమిత్ షా స్పందించారు.

గత ఏడాది ఆగష్టు 15న ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రకటనకు అనుగుణంగా ఈ కమిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. అమిత్ షా వెల్లడించిన వివరాల ప్రకారం.. రిటైర్డ్ జస్టిస్ ప్రకాష్ ప్రభాకర్ నోలేకర్ ఈ కమిటీకి నేతృత్వం వహిస్తారు. ఈ కమిటీలో జనాభా లెక్కల కమిషనర్, రిటైర్డ్ ఐఏఎస్ దుర్గా శంకర్ మిశ్రా, రిటైర్డ్ ఐపీఎస్ బాలాజీ శ్రీవాస్తవ, ప్రముఖ ఆర్థికవేత్త డా.షామికా రవి సభ్యులుగా ఉంటారు. హోం అఫైర్స్ మంత్రిత్వ శాఖకు చెందిన జాయింట్ సెక్రెటరీ కూడా ఇందులో సెక్రెటరీ మెంబర్‌గా వ్యవహరిస్తారు. జనాభాలో కలుగుతున్న అనియంత్రిత మార్పులు జాతీయ సమగ్రతకు, భద్రతకు, శాంతి భద్రతలకు, ఆదిమ తెగ సమాజానికి ముప్పుగా మారాయని అమిత్ షా భావిస్తున్నారు.

దేశంలోని కొన్ని ప్రాంతాల్లో జనాభా వేగంగా పెరగడం, అక్రమ వలసలు, ఇతర అసహజ కారణాలను ఈ కమిటీ అధ్యయనం చేస్తుంది. మతపరంగా, సామాజిక వర్గాల పరంగా జనాభా ఎలా పెరుగుతుందో ఈ కమిటీ అంచనా వేయనుంది. దీనికి తగిన పరిష్కారాల్ని కూడా కమిటీ సూచించనుంది.

## అదుపుతప్పి బోల్తాపడిన బస్సు.. ఆరుగురు దుర్మరణం.. 21 మందికి గాయాలు



న్యూఢిల్లీ, మే 26: ప్రయాణికులతో వెళ్తున్న బస్సు అదుపుతప్పి బోల్తాపడటంతో ఆరుగురు అక్కిడికక్కడే దుర్మరణం పాలయ్యారు. మరో 21 మంది గాయపడ్డారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఉన్నవ్ జిల్లా లో ఆగ్రా-లక్నో ఎక్స్‌ప్రెస్‌వే పై మంగళవారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. ఢిల్లీ నుంచి బీహార్ వైపు వెళున్న ఓ ప్రైవేట్ బస్సు అదుపుతప్పి బోల్తాపడింది. అరస్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్స్‌ప్రెస్‌వేపై 262వ కిలోమీటర్ మైలురాయి దగ్గర జరిగిన ఈ ప్రమాదం గురించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.

సమాచారం అందుకున్న పోలీసులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని వెంటనే సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టానికి పంపించారు. ప్రమాదంలో మృతిచెందిన వారిలో ఒక సబ్‌ఇన్‌స్పెక్టర్, ఒక ఖైదీ ఉన్నట్లు అరస్ ఎస్‌వో సంజీవ్ కుశ్వాహ్ తెలిపారు. మరణించిన సబ్-ఇన్‌స్పెక్టర్‌ను రామచంద్రగా గుర్తించారు. తన విధి నిర్వహణలో భాగంగా ఖైదీ ఛత్రపాల్‌ను సివాన్ నుంచి ఢిల్లీకి తీసుకెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

ప్రమాదం జరిగిన వెంటనే హైవే అథారిటీ సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. బస్సు శిథిలాల నుంచి మృతదేహాలను బయటకు తీసి పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. గాయపడిన 10 మందికిపైగా ప్రయాణికుల్లో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. వారిని మెరుగైన చికిత్స కోసం లక్నోలోని కింగ్ జార్జ్ మెడికల్ యూనివర్సిటీ ట్రామా సెంటర్‌కు తరలించారు. ఘటనపై ఉన్నవ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## స్వర్ణాంధ్ర విజన్-2047 లక్ష్యాలపై సీఎం చంద్రబాబు సమీక్ష.. వ్యవసాయ అనుబంధ రంగాలపై కీలక చర్చ

అమరావతి, మే 26:ఏపీ నారా చంద్రబాబు నాయుడు ఈరోజు (మంగళవారం) అమరావతిలోని తన క్యాంప్ కార్యాలయంలో వ్యవసాయ అనుబంధ రంగాలపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. 'స్వర్ణాంధ్ర విజన్ 2047'లో భాగంగా ప్రాథమిక రంగ అభివృద్ధికి సంబంధించిన ఆరు కీలక మిషన్లపై అధికారులతో విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశానికి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, సీఎస్ సాయిప్రసాద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు, కార్పొరేషన్ చైర్మన్లు హాజరయ్యారు. వ్యవసాయం, హార్టికల్చర్, ఆక్వాకల్చర్, మార్కెటింగ్, పశుసంవర్ధక శాఖల పనితీరు, భవిష్యత్తు కార్యాచరణపై సీఎం చంద్రబాబు చర్చించారు.

ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో నమోదవుతున్న వర్షపాతం పరిస్థితులు, సాగునీటి లభ్యత, రైతులకు విత్తనాల పంపిణీ, పంటల ప్రణాళిక వంటి అంశాలపై సీఎం ప్రత్యేక దృష్టి సారించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా వ్యవసాయ రంగంలో సాంకేతికత వినియోగం, ఉత్పాదకత పెంపు, మార్కెటింగ్ సౌకర్యాల విస్తరణ, ఎగుమతుల అవకాశాలపై కూడా సమావేశంలో చర్చించారు. రైతుల ఆదాయం పెంచే దిశగా ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతోందని అధికారులు వెల్లడించారు.

# సీనియర్ సిటిజన్ల సంక్షేమానికి తోడ్పడలేమా !

## (27 మే "జాతీయ సీనియర్ సిటిజన్ల ఆరోగ్యం మరియు ఫిట్‌నెస్ దినోత్సవం" సందర్భంగా)

జనాభా 60 ఏండ్లు లేదా ఆ పైన వయస్సు కలిగిన ప్రజలను "వయోవృద్ధులు"గా వర్గీకరిస్తాం. భారత్‌లో పన్నుల విభాగ నిర్వచనం ప్రకారం, 60 నుంచి 79 ఏండ్ల వయస్సు ఉన్న వారిని "సీనియర్ సిటిజెన్స్" అని, 80 ఏండ్లు లేదా ఆపైన వయస్సు కలిగిన వీరిని "సూపర్ సీనియర్ సిటిజెన్స్" అని పిలుస్తాం. నిన్నటి కాలంలో హీరోలు, పౌర సమాజానికి నాయకత్వం వహించిన వారు, అపార అనుభవాల పుట్టలు, వివేకవంతులు, నేటి యువతకు సరైన మార్గనిర్దేశకులు అయిన వయోవృద్ధుల ప్రాధాన్యాన్ని గుర్తించి ప్రతి ఏటా మే నెల చివరి బుధవారం, అనగా 27 మే 2026 రోజున "జాతీయ సీనియర్ సిటిజన్ల ఆరోగ్యం మరియు ఫిట్‌నెస్ దినోత్సవం (నేషనల్ సీనియర్ సిటిజెన్స్ హెల్త్ అండ్ ఫిట్‌నెస్ డే)"ను పాటించడం ఆనవాయితీగా మారింది. కుటుంబ సభ్యులు, స్నేహితులు, సంస్థలు, పౌర సమాజం వయో వృద్ధులను తగు రీతిలో గౌరవంగా చూసుకోవడంతో పాటు వారు నిర్వహించిన పాత్రను తగు రీతిలో గుర్తు చేసుకుంటూ, వారి అభిప్రాయాలకు విలువను ఇస్తూ, వారి శ్రేయస్సుకు ప్రాధాన్యం ఇస్తూ, వారికి కృతజ్ఞతలను వ్యక్తం చేస్తూ, వారి హక్కులను గౌరవిస్తూ పలు కార్యక్రమాలను నిర్వహించడం ఈ దినోత్సవ ప్రత్యేకతగా గమనించాలి.

**జాతీయ సీనియర్ సిటిజన్ల ఆరోగ్యం మరియు ఫిట్‌నెస్ దినోత్సవం -2026 ఇతివృత్తం:**

అమెరికాలో ప్రారంభమైన జాతీయ సీనియర్ సిటిజన్ల ఆరోగ్యం మరియు ఫిట్‌నెస్ దినోత్సవ ప్రాధాన్యాన్ని గుర్తించిన ఐరాస ఈ దినోత్సవాన్ని జరుపుకోవాలని ప్రపంచ దేశాలకు విజ్ఞప్తులు చేయడం జరుగుతున్నది. సీనియర్ సిటిజన్లు నేటి సమాజ పునాది రాళ్లు అని గమనించి వారిని సముచితంగా గౌరవించుకోవడం, వారి సేవలకు కృతజ్ఞతలు తెలియజేయడం, వారి సమ్మిళిత అభివృద్ధికి బాటలు వేయడం కొనసాగుతూనే ఉండాలని ఐరాస సూచిస్తున్నది. జాతీయ సీనియర్ సిటిజన్ల ఆరోగ్యం మరియు ఫిట్‌నెస్ దినోత్సవం-2026 ఇతివృత్తంగా "కదలండి, కనెక్ట్ కండి, నిమగ్నం కండి (మువ్, కనెక్ట్ అండ్ ఎంగేజ్)" అనే అంశాన్ని తీసుకొని అవగాహన కలిపించడం జరుగుతున్నది. పథక రచనలు, పౌర సమాజ సమస్యలు, కుటుంబ ఇబ్బందులకు పరిష్కారాలు ఇవ్వడంలో సీనియర్ సిటిజన్ వయోవృద్ధుల అభిప్రాయాలను ఆచరణలో పెట్టాలని నేటి తరం గుర్తుంచుకోవాలి. సీనియర్ సిటిజన్లకు ప్రాధాన్యం ఇస్తూనే వారి విజయ గాథలను ప్రచారం చేయడం, వారి సూచనలు పాటించడం జరిగిన నాడు సమాజంలో శాంతి నెలకొంటుందని మరువరాదు. సీనియర్ సిటిజన్లతో నేటి తరం వయస్సు వ్యత్యాసాలను మరిచి అందరూ కలిసి ఆనందంగా గడపడం కూడా సీనియర్స్ ఆత్మవిశ్వాసాన్ని పెంచడానికి ఉపయోగపడుతుంది.

**సీనియర్ సిటిజన్లకు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు:**

నేటి పౌర సమాజంతో డిజిటల్ కాలపు యువత తమ ఇంట్లోని సీనియర్ వృద్ధులను చిన్న చూపు చూడడం, వారికి ఏమీ తెలియదు అన్నట్లుగా భావించడం కొనసాగుతున్న ఏఐ యుగంలో ఉన్నాం. కొన్ని సందర్భాల్లో మనవడు లేదా మనుమరాలు కూడా తాతను పట్టించుకోవడం లేదు, వారి అభిప్రాయాలను అడగడం లేదు సరికదా వారిని ఒక కుటుంబ సభ్యుడిగా కూడా చూడడానికి సంకోచిస్తున్నారు. నేటి జనాభాలో 22 శాతంగా ఉన్న సీనియర్ సిటిజన్లు అయిన వయో వృద్ధులను గత చరిత్ర నిర్మాతలుగా చూడడం మంచిది. వారి విజ్ఞాన వివేకాలు నేటి తరానికి చక్కటి మార్గాన్ని చూపుతాయి. కుటుంబ సాంప్రదాయాలను సూచించడం, వివేకంతో సమస్యలకు సత్వర పరిష్కారాలు చూపడం, ఆరోగ్యం సహకరిస్తే సీనియర్ సిటిజెన్స్ స్వచ్ఛందంగా రంగంలోకి దిగి సేవలు చేయడం జరుగుతుంది. నేటి వయో వృద్ధులు దీర్ఘకాలిక వ్యాధులు, ఒంటరితనం, నిరాదరణ, అనారోగ్య సేవలు, ఆర్థిక ఇబ్బందులు, మానసిక బలహీనతలు, కీళ్ల నొప్పులు, సులభంగా నడవలేక పోవడం, కుటుంబం పై ఆధారపడడం, చిన్న చూపు లేదా వేదనలకు గురి కావడం, సామాజిక సహాయం కొరవడడం, సౌకర్యాల లేమి, అంగ వైకల్యం, సహాయం చేసే చేతులు లేకపోవడం, సామాజిక బహిష్కరణ లాంటి అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. వివిధ తరాల సమావేశాలు, ప్రోత్సాహక సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు, సీనియర్లకు తగు సేవలు చేయడం, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం, సీనియర్ సిటిజెన్స్ సేవా కేంద్రాల్లో స్వచ్ఛందంగా పని చేయడం, వయో వృద్ధుల విజయ గాథలను ప్రచారం చేయడం లాంటి కార్యక్రమాలకు జాతీయ సీనియర్ సిటిజన్ల ఆరోగ్యం మరియు ఫిట్‌నెస్ దినం వేదిక కావాలి. జాతీయ సీనియర్ సిటిజన్ల ఆరోగ్యం మరియు ఫిట్‌నెస్ దినోత్సవం రోజున వారి ముఖాల్లో నవ్వుల పువ్వులు చూడడానికి ప్రయత్నించాలి. సీనియర్ సిటిజెన్స్‌కు సంబంధించిన నినాదాలను ప్రచారం చేయాలి. మనల్ని కంటికి రెప్పలా పెంచి మంచి స్థాయిని కల్పించి, తమ సంపాదనను మన ఎదుగుదలకు నీళ్ల వలె ఖర్చు చేసిన వయో వృద్ధులను గుండెలో పెట్టుకొని చూసుకోవడం మన కనీస కర్తవ్యం. వయో వృద్ధులు సజీవ గ్రంథాలయాలు, అపార వివేక నిఘంటువులు. నిన్నటి రోజుల్లో నేటి వయో వృద్ధులు చేసిన అద్వితీయ సేవలను గుర్తు చేసుకుంటూ, మన ఎదుగుదలకు వారి సలహాలను మెట్లు తీసుకుంటూ, వారితో కలిసి కుటుంబం సంతోషంగా సాగిపోవడమే మన ముందున్న ఏకైక మార్గం అని మరువరాదు. నేటి యువత కూడా రేపటి సీనియర్ సిటిజన్లను గుర్తుంచుకోవాలని వారి అమూల్య సలహాలు తీసుకోవాలి. సీనియర్ సిటిజెన్స్‌కు నేటి తరం ఊత కర్రలు కావాలి. నేటి తరం యువత ఎగరడానికి వయోవృద్ధుల అనుభవాలను రెక్కలుగా మార్చుకోవాలి. వయోభేదం మరిచి సమ్మిళిత పౌర సమాజ స్థాపనకు కృషి జరగాలి.

-మధుపాళీ
9949700037

# మొహాలీలో ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌ల ఆధ్వర్యంలో 'గవర్నెన్స్ సమ్మిట్-2026'

న్యూ ఢిల్లీ, మే 26:ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ)కి చెందిన భారతీ పబ్లిక్ పాలసీ ఇనిస్టిట్యూట్ సహకారంతో 'గవర్నెన్స్ సమ్మిట్-2026' పేరుతో ఒక కార్యక్రమాన్ని ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ 2026 మే నెల 23న ఐఎస్‌బీ-మొహాలీ క్యాంపసులో నిర్వహించింది.

ఈ శిఖరాగ్ర సదస్సు నాలుగో సంచికను కేంద్ర ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ కార్యదర్శి శ్రీ ఎస్. కృష్ణన్ కీలకోపన్యాసంతో మొదలుపెట్టారు. డిజిటల్ సేవలు ప్రధానంగా ఉండే ఆర్థిక వ్యవస్థలోని చివరి అంచె వ్యక్తులు సహా, పౌరులందరికీ ఉపయోగపడేలా ఏఐ విస్తారిత అనుబంధ వ్యవస్థను తీర్చిదిద్దడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని శ్రీ కృష్ణన్ తెలిపారు. ''ఉత్పాదకతను పెంచుకోవడం, పాలనను మెరుగుపరుచుకోవడం, ఆరోగ్య సంరక్షణ, విద్య, తయారీ, ఆర్థిక సేవల్ని అందరి చెంతకూ చేర్చడం వంటి రంగాల్లో లభ్యతను విస్తరించడం కోసం వీటిలో పెనుమార్పుల్ని తీసుకురాగల అవకాశాలను కృత్రిమ మేధ (ఏఐ) భారత్‌కు అందించగలుగుతుంది'' అని ఆయన వివరించారు. ఏమైనా, నైపుణ్యాలతో ముడి పడిన ఉద్యోగాలపై ఏఐ ప్రసరింపచేసే ప్రభావం విషయంలో వ్యక్తమవుతున్న ఆందోళనలు అర్థం చేసుకోదగ్గవని ఆయన అన్నారు. అలా ఆయన అంటూనే, సమ్మిళిత అభివృద్ధి సాధన దిశగా పయనించడంలో ఈ సాంకేతికత ఇవ్వజూపే ప్రయోజనాల్ని సద్వినియోగపరుచుకోగల సామర్థ్యం భారత్‌కు ఉందని తెలిపారు.

రోజంతా నిర్వహించిన కార్యక్రమంలో నాలుగు ముఖ్య విషయాలపై బృందాలవారీగా చర్చించారు. వాటిలో.. డిజిటల్ వాణిజ్యంలో ఏఐ పాత్ర, ఆన్‌లైన్ మాధ్యమాన్ని వినియోగించుకోవడంలో మహిళలకు, బాలలకు ఎదురయ్యే ఆపదలకు తగిన భద్రతా చర్యలను రూపొందించడం, ఆరోగ్య సంరక్షణ సేవలను తక్కువ ఖర్చులో అందరి అందుబాటులోకి తీసుకురావడం, ఉద్యోగావకాశాల కల్పనతో పాటు డిజిటల్ రంగంలో ఔత్సాహిక పారిశ్రామికత్వ స్ఫూర్తిని ప్రోత్సహించడం వంటి అంశాలు ఉన్నాయి. మరో వైపు, దీనికి సమాంతరంగా నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో, రాష్ట్ర ప్రభుత్వాల మొదలు గ్రామ పంచాయతీల దాకా.. చివరి దశ వరకూ ప్రజా సేవల అందజేతలో ఏఐ ప్రధానపాత్ర వహించేలా నిర్వహణ సామర్థ్యాన్ని ఉపయోగించుకోవాల్సిన అవకాశాల్ని పరిశీలించారు.

ఐఎస్‌బీకి చెందిన భారతీ పబ్లిక్ పాలసీ ఇనిస్టిట్యూట్ అసోసియేట్ ప్రొఫెసరు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు ప్రొఫెసర్ అశ్వినీ ఛత్రే ప్రారంభోపన్యాసాన్ని ఇచ్చారు. కృత్రిమ మేధ (ఏఐ) ఫలాలను ఆచరణీయ పాలన ప్రణాళికల్లో భాగంగా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన స్పష్టం చేశారు. "తదుపరి తరం భవిష్యత్తుకు రూపురేఖలను కల్పించే ఒక దీర్ఘకాలిక జాతీయ మిషన్‌గా ఏఐని లెక్కలోకి తీసుకోవాలి. అసమానతలు, శీఘ్రగతిన దూసుకు వస్తున్న అవకాశాలు, రాబోయే కాలంలో రూపురేఖల్ని మార్చుకోబోతున్న ఉద్యోగాలు.. ఇవి సరికొత్తగా తెర మీదకు వస్తున్న ఏఐ స్వరూపానికి సంబంధించిన కీలక పార్శ్వాలు అని గుర్తు పెట్టుకోవాలి" అని ఆయన అన్నారు. తగిన భద్రతాచర్యలు, సామాజిక భద్రతా యంత్రాంగాలు, సకారాత్మక కార్యాచరణలను అనుసరిస్తూ ఏఐ అందించే అవకాశాల్ని అందరూ సమాన స్థాయిల్లో చేజిక్కించుకోవాలని ప్రొఫెసర్ ఛత్రే స్పష్టం చేశారు.

ఈ శిఖరాగ్ర సదస్సులో ప్రభుత్వ సీనియర్ అధికారులు, పరిశ్రమతో పాటు విద్యా రంగ ప్రముఖులు, పౌర సమాజ ప్రతినిధులు పాల్గొన్నారు. వారు సమ్మిళితత్వాన్ని పెంపొందింపచేయడానికి, పాలనను బలోపేతం చేయడానికి, భారత్ అభివృద్ధి అజెండాకు అతి త్వరగా కార్యరూపాన్ని ఇవ్వడానికి కృత్రిమ మేధను ఏయే విధాలుగా వినియోగించుకోవచ్చో ఈ సందర్భంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రిలయన్స్ రిటైల్, మాస్టర్‌కార్డ్, అపోలో హాస్పిటల్స్, ఐఐటీ మద్రాస్, యూనిసెఫ్ ఇండియా, పంజాబ్ పోలీస్‌తో పాటు కేంద్ర ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు పాలుపంచుకున్నాయి.

# నెలాఖరులోపు జనగణన పూర్తి చేయాలి

**-ప్రతి ఇంటి వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశం**
**సమన్వయంతో సర్వే ప్రక్రియ వేగవంతం చేయాలి**

తిరుపతి, మే 26:జనగణన కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో తీసుకుని ఈ నెలాఖరులోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎన్. వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులతో కలిసి నిర్వహించిన వర్చువల్ సమీక్షలో ఆయన మాట్లాడారు.

జనగణన ప్రక్రియలో 2011 గణాంకాలతో పోల్చి ఎటువంటి వ్యత్యాసాలు లేకుండా ఖచ్చితత్వంతో డేటా నమోదు చేయాలని తహసీల్దార్లు, ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు సూచించారు. జిల్లాలో ప్రతి ఇంటి వివరాలు సమగ్రంగా నమోదు చేయాలని, ఎవరూ మిగలకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. తహసీల్దార్లు, ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు సమన్వయంతో పనిచేసి నిర్దేశిత గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించి సర్వే ప్రక్రియకు ఎటువంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జనగణన ద్వారా ప్రభుత్వ ప్రణాళికలు, సంక్షేమ కార్యక్రమాల అమలుకు అవసరమైన కీలక సమాచారం సిద్ధమవుతుందని, ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

# ఆందోళన వ్యక్తం చేసిన పవన్ కల్యాణ్

**-రెండో రోజూ రాజమహేంద్రవరంలో పర్యటన**
**-గోదావరి నదీ పరివాహక ప్రాంతం పరిశీలన**
**-పుష్కరాలలో కాలుష్య లేకుండా చూడాలని ఆదేశం**



అమరావతి, మే 26:గోదావరి పుష్కరాలకు ముందు.. ప్రత్యేక ఏర్పాట్లపై దృష్టి పెట్టారు ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. రాజమండ్రిలో గోదావరి నదిలో పెరుగుతున్న కాలుష్యంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రెండో రోజు కూడా క్షేత్రస్థాయిలో తనిఖీలు కొనసాగిస్తూ, గోదావరిలో పరిశ్రమల వ్యర్థాలు కలుస్తున్న ప్రాంతాలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మరోసారి బోటు ప్రయాణం చేసి కాలుష్య పరిస్థితిని దగ్గర నుంచి పరిశీలించారు.

వెంకటనగరం సమీపంలో ఉన్న ఆంధ్ర పేపర్ మిల్స్ నుంచి విడుదలవుతున్న వ్యర్థాలు గోదావరిలో కలిసే ప్రాంతానికి చేరుకున్న పవన్ కల్యాణ్.. అధికారులతో కలిసి నీటి శాంపిల్స్ సేకరింపజేశారు. ఆకస్మిక తనిఖీల్లో కాలుష్య నియంత్రణ నిబంధనల అమలులో పలు లోపాలు ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, "పవిత్ర గోదావరిలో కాలుష్య వ్యర్థాలు కలవడం చాలా దారుణం. పుష్కరాల సమయంలో ఈ నీటిలో స్నానం చేస్తే పుణ్యం కాదు, రోగాలు వస్తాయి" అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఏలూరులో తాగునీటి కాలుష్యంతో జరిగిన ఘటనలను గుర్తు చేస్తూ, పరిశ్రమల అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణ కూడా సమానంగా ముఖ్యమని స్పష్టం చేశారు.

"రాష్ట్ర అభివృద్ధికి పరిశ్రమలు అవసరమే. కానీ పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత కూడా మనందరిదే. పరిశ్రమల నుంచి వెలువడుతున్న కాలుష్యంపై అసెంబ్లీ, కేబినెట్ సమావేశాల్లో చర్చిస్తామన్ని పవన్ కల్యాణ్ అన్నారు. తనిఖీల సందర్భంగా పర్యావరణ శాఖ బాధ్యతలపై మంత్రి కందుల దుర్గేష్‌ను ఉద్దేశించి కూడా పవన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. "పుష్కరాల రేవులను అందంగా తీర్చిదిద్దడం మాత్రమే కాదు, గోదావరిలో కాలుష్యం జరగకుండా చూడాల్సిన బాధ్యత కూడా ఉంది" అని వ్యాఖ్యానించారు. దీనికి స్పందించిన మంత్రి కందుల దుర్గేష్, రాజమండ్రి పేపర్ మిల్ కాలుష్య సమస్యపై తాము నిరంతరం పోరాడుతున్నామని తెలిపారు. ఇప్పటికే పలుమార్లు అధికారులతో సమీక్షలు నిర్వహించి చర్యలు చేపట్టినట్లు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు వివరించారు.

# అంగన్వాడీలను వేధిస్తున్న సీడీపీఓపై సస్పెన్షన్ డిమాండ్

**-అవినీతిపై సమగ్ర విచారణ జరపాలని యూనియన్ ధర్నా**
**-చిత్తూరు కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగిన అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్**




చిత్తూరు, మే 26: జీడీనెల్లూరు ప్రాజెక్టులో అంగన్వాడీ కార్యకర్తలను వేధిస్తున్న సీడీపీఓను వెంటనే సస్పెండ్ చేయాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. అలాగే అక్కడ జరుగుతున్న అక్రమాలు, అవినీతిపై సమగ్ర విచారణ జరపాలని కోరుతూ మంగళవారం చిత్తూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా యూనియన్ నాయకులు గోవిందమ్మ, షకీలా, లలిత, విజయ మాట్లాడుతూ సదరు సీడీపీఓ గతంలో పనిచేసిన ప్రాజెక్టుల్లో కూడా అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. జీడీనెల్లూరు ప్రాజెక్టులో బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా యూనియన్‌లను పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ కార్యకర్తలను వేధిస్తున్నారని విమర్శించారు.

యూనియన్‌పై తప్పుడు ఆరోపణలు చేయిస్తూ విభేదాలు సృష్టించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. అక్రమాలపై ప్రశ్నిస్తే ఎదురుదాడులకు దిగుతున్నారని మండిపడ్డారు. ఇప్పటివరకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తున్నదని పేర్కొన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గిరిధర్ గుప్తా మాట్లాడుతూ అంగన్వాడీ సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్న యూనియన్‌పై తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. యూనియన్‌తో పెట్టుకుంటే తగిన ఫలితాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, అంగన్వాడీ యూనియన్ ప్రతినిధులు, బాధిత కార్యకర్తలు పాల్గొన్నారు.

# భారత్‌లో ఇప్పటివరకు ఎబోలా కేసులేవీ నమోదు కాలేదు: శ్రీ నడ్డా

న్యూ ఢిల్లీ, మే 26:ఆఫ్రికాలోని కొన్ని ప్రాంతాలలో ఇటీవల ఎబోలా వ్యాధి వ్యాప్తి చెందిన నేపథ్యంలో భారత్ లో దానికి సంబంధించిన సన్నాహక, నిఘా చర్యలపై కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ జగత్ ప్రకాష్ నడ్డా ఈ రోజు ఢిల్లీలో సమీక్ష నిర్వహించారు.

భారత్ లో ఇప్పటివరకు బుండిబుగ్యో ఎబోలా వ్యాధికి సంబంధించి ఒక్క కేసు కూడా నమోదవ్వలేదని కేంద్ర ఆరోగ్య మంత్రి స్పష్టం చేశారు. అయితే, ప్రపంచ ఆరోగ్య సంస్థ ఎబోలాను అంతర్జాతీయ ఆందోళన కలిగించే ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిగా, ఆఫ్రికా సీడీసీ దీనిని ఖండాంతర భద్రతా ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిగా ప్రకటించినందున భారత ప్రభుత్వం ఆఫ్రికాలోని ఎబోలా పరిస్థితిని నిరంతరం నిశితంగా పర్యవేక్షిస్తోంది. ప్రజారోగ్య రక్షణ కోసం ముందుజాగ్రత్తగా దేశవ్యాప్తంగా నిఘా, సన్నాహక చర్యలను మరింత ముమ్మరం చేసింది.

కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ముందస్తు జాగ్రత్త చర్యగా జాతీయ వ్యాధి నివారణ కేంద్రం (నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ - ఎన్సీడీసీ) డీజీహెచ్ఎస్, ఐసీఎంఆర్, పౌర విమానయాన శాఖ, ఇమ్మిగ్రేషన్ అధికారులు, ఇతర సంబంధిత మంత్రిత్వ శాఖలు, విభాగాలతో సమన్వయం చేసుకుంటూ దేశవ్యాప్తంగా నిఘాను, ప్రజారోగ్య సన్నద్ధతను బలోపేతం చేసిందని శ్రీ నడ్డా పేర్కొన్నారు.

అంతర్జాతీయ విమానాశ్రయాలు, ఇతర ప్రవేశ మార్గాల వద్ద స్క్రీనింగ్, నిఘా చర్యలను ముమ్మరం చేశారు. స్క్రీనింగ్, క్వారంటైన్, క్లినికల్ మేనేజ్‌మెంట్, ల్యాబొరేటరీ పరీక్షలు, వ్యాధి నివారణ పద్ధతులపై ప్రామాణిక నిర్వహణ (ఎస్ఓపీ) విధానాలతో కూడిన సూచనలను అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు పంపారు. సన్నద్ధత, స్పందన చర్యలను సమీక్షించడానికి రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలు, సంబంధిత భాగస్వాములతో సమావేశాలు కూడా నిర్వహించారు. ట్రాకింగ్, టెస్టింగ్, నిఘా కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లను నిరంతరం సిద్ధంగా ఉంచాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శిని, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) డైరెక్టర్ జనరల్‌ను, నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ డైరెక్టర్‌ను కేంద్ర మంత్రి ఆదేశించారు.

డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఉగాండా, సౌత్ సూడాన్ దేశాలకు అత్యవసరం కాని ప్రయాణాలను వాయిదా వేసుకోవాల్సిందిగా 2026 మే 24న భారత్ తన పౌరులకు ప్రయాణ మార్గదర్శకాలు జారీ చేసింది. దీనికంటే ముందు, 2026 మే 21న కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఎబోలా వ్యాధి సన్నద్ధత, స్పందనపై అంతర్జాతీయ ప్రయాణికులు పాటించాల్సిన నిబంధనలతో కూడిన ఎస్ఓపీలను జారీ చేసింది. ఆసుపత్రులలో వ్యాధి నియంత్రణ, ఐసోలేషన్ వసతుల సన్నద్ధత, ఎబోలా రోగుల మృతదేహాలను సురక్షితంగా, గౌరవప్రదంగా నిర్వహించడానికి సంబంధించిన మార్గదర్శకాలను 2026 మే 22న విడుదల చేసింది.

అంతర్జాతీయ ప్రయాణికులలో కారణం తెలియని జ్వరాల పట్ల గట్టి నిఘా ఉంచాలని, అనుమానిత కేసులు ఏవైనా ఉంటే వాటిని వెంటనే నివేదించి, తగిన నిర్వహణ చర్యలు చేపట్టాలని ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వైలెన్స్ ప్రోగ్రామ్ (ఐడిఎస్పీ) యూనిట్లను, విమానాశ్రయ ఆరోగ్య సంస్థలను ఆదేశించారు.

ఎబోలా వ్యాధిని అధిక మరణాల రేటు కలిగిన తీవ్రమైన వైరల్ హెమరేజిక్ జ్వరంగా గుర్తించారు. బుండిబుగ్యో వైరస్ వల్ల వచ్చే ఎబోలా వ్యాధికి అనుమతించిన వ్యాక్సిన్‌లు కానీ, నిర్దిష్ట చికిత్సలు కానీ అందుబాటులో లేవు.

ఈ సమావేశంలో కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి శ్రీమతి పుణ్య సలిల శ్రీవాస్తవ, ఆరోగ్య పరిశోధన విభాగం కార్యదర్శి, ఐసీఎంఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజీవ్ బాల్, డీజీహెచ్ఎస్ డాక్టర్ సునీతా శర్మ, కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి శ్రీ రాకేష్ గుప్తా, కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీమతి జి. ఎస్. చిత్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖకు చెందిన ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 2026 మే నెలలో డీజిల్ విక్రయాల్లో 12.6 శాతం, పెట్రోల్ విక్రయాల్లో 9 శాతం పెరుగుదల.. తెలంగాణవ్యాప్తంగా 37 లక్షల గృహ ఎల్‌పీజీ సిలిండర్ల పంపిణీ

న్యూ ఢిల్లీ, మే 26:తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అంతరాయం లేకుండా పెట్రోల్ (ఎంఎస్), డీజిల్ (హెచ్ఎస్‌డీ), ఎల్‌పీజీ అందుబాటులో ఉండేలా చూసేందుకు ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థలైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్‌లు.. తమ కార్యకలాపాలు, రవాణా ఏర్పాట్లను రాత్రింబవళ్లు సమన్వయం చేసుకుంటున్నాయి.

వివిధ రంగాల్లో ఇంధన డిమాండ్ ఒక్కసారిగా పెరిగినప్పటికీ సరఫరా వ్యవస్థ ఎటువంటి అంతరాయం లేకుండా సాఫీగా సాగుతోంది. ముఖ్యంగా 2026 మే నెలలో తెలంగాణలో పంట కోత, వ్యవసాయ పనులు ఊపందుకోవటంతో పాటు భారీ ఎత్తున ధాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగుతోంది. దీనివల్ల ఇటీవల కాలంలో చమురు ఉత్పత్తులకు డిమాండ్ గణనీయంగా పెరిగింది. ధరలు తక్కువ ఉండటంతో ప్రైవేట్ బంకుల వినియోగదారులు సైతం ప్రభుత్వ రంగ పెట్రోల్ బంకుల వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వ రంగ విక్రయ కేంద్రాల్లో ధరల ప్రయోజనం ఉండటంతో సంస్థాగత, వాణిజ్య వినియోగదారులు సైతం వీటి నుంచే ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్నారు. 2026 మే నెలలో తెలంగాణలో ఇంధన విక్రయాలు బలమైన వృద్ధిని నమోదు చేశాయి. సాధారణ వృద్ధి రేటు కంటే చాలా ఎక్కువగా.. డీజిల్ (రిటైల్) విక్రయాలు 12.6 శాతం, పెట్రోల్ (రిటైల్) విక్రయాలు 9 శాతం పెరిగాయి. రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో ప్రభుత్వ రంగ (పీఎస్‌యూ) పెట్రోల్ బంకుల్లో జరిగిన డీజిల్ అమ్మకాలు 25 శాతానికి పైగా వృద్ధిని నమోదు చేయగా.. 12 జిల్లాల్లో 15 నుంచి 25 శాతం మధ్య వృద్ధి నమోదైంది.

# పటిష్టమైన శాస్త్ర, పరిశ్రమల భాగస్వామ్యంతో భారత్ చవకైన వైద్య సేవల సాంకేతికతలకు ప్రపంచ కేంద్రంగా ఆవిర్భవిస్తోందన్న కేంద్ర సహాయ మంత్రి శ్రీ ప్రతాపరావు జాదవ్

న్యూ ఢిల్లీ, మే 26:దేశంలోనే అతిపెద్ద బయోమెడికల్, సాంకేతిక బదిలీ ప్రోత్సాహక కార్యక్రమమైన "వైద్య ఆవిష్కరణల పేటెంట్ మిత్ర: ఆవిష్కర్తలతో పరిశ్రమల అనుసంధానం"ను కేంద్ర వైద్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ పరిధిలోని ఆరోగ్య పరిశోధనల విభాగానికి చెందిన 'భారత వైద్య పరిశోధనా మండలి (ఐసీఎంఆర్) నేడు న్యూఢిల్లీలోని మానేక్షా కేంద్రంలో విజయవంతంగా నిర్వహించింది.

ఐసీఎంఆర్ ప్రారంభించిన వైద్య ఆవిష్కరణల పేటెంట్ మిత్ర కార్యక్రమం ద్వారా బయోమెడికల్ ఆవిష్కరణలను ప్రదర్శించడానికి, సాంకేతిక బదిలీ ప్రక్రియల కోసం దేశంలోనే తొలి వ్యవస్థీకృత వేదికల్లో ఒకటి ఏర్పాటైంది. పటిష్టమైన పారిశ్రామిక భాగస్వామ్యాల ద్వారా దేశీయ బయోమెడికల్ పరిశోధనలను, పరిశ్రమల భాగస్వామ్యంతో సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే వైద్య సేవల పరిష్కారాలుగా మార్చడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం.

ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని నీతి ఆయోగ్ సభ్యులు ప్రొఫెసర్ గోబర్ధన్ దాస్ సమక్షంలో కేంద్ర ఆయుష్ శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత), కేంద్ర వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీ ప్రతాప్‌రావ్ గణపత్‌రావ్ జాదవ్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా కేంద్ర సహాయమంత్రి శ్రీ జాదవ్ మాట్లాడుతూ.. "దేశ వైజా&జనిక రంగాన్ని పారిశ్రామిక రంగంతో అనుసంధానించడంలో ఈ కార్యక్రమం ఒక నిర్ణయాత్మక చర్య. మన ప్రయోగశాలల్లో రూపుదిద్దుకునే సరికొత్త ఆవిష్కరణలు ప్రజారోగ్యాన్ని బలోపేతం చేసేందుకు, వికసిత్ భారత్ సంకల్పాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు దోహదపడుతుంది. ఐసీఎంఆర్ వంటి సంస్థలు, పటిష్టమైన పారిశ్రామిక భాగస్వామ్యాల సహకారంతో భారత్ కేవలం వైద్య సాంకేతికతలను వినియోగించే స్థాయి నుంచి ప్రపంచ దేశాలకు తక్కువ ఖర్చుతో కూడిన వినూత్న వైద్య సేవలకు పరిష్కారాలను అందించే కేంద్రంగా ఎదుగుతోంది" అని పేర్కొన్నారు.

నీతి ఆయోగ్ సభ్యులు డాక్టర్ గోవర్ధన్ దాస్ మాట్లాడుతూ.. "వైద్య సాంకేతికత రంగంలో ప్రపంచ నాయకుడిగా ఎదగడానికి అవసరమైన శాస్త్రీయ సామర్థ్యం, బలమైన ఆవిష్కరణల వ్యవస్థ భారత్‌కు ఉన్నాయి. మేధో సంపత్తిని రక్షించడంలో, సాంకేతిక బదిలీని సులభతరం చేయడంలో, దేశీయ ఆవిష్కరణలను ప్రయోగశాలల నుంచి నేరుగా సమాజానికి చేరవేయడంలో వైద్య ఆవిష్కరణల పేటెంట్ వివైద్య పరిశోధనల విభాగం కార్యదర్శి, ఐసీఎంఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ రాజీవ్ బాల్ మాట్లాడుతూ.. "అత్యాధునిక పరిశోధనలు కేవలం ప్రయోగశాలలకే పరిమితం కాకుండా బలమైన పారిశ్రామిక భాగస్వామ్యాలు, సమర్థవంతమైన సాంకేతిక బదిలీ ద్వారా సామాన్య ప్రజలందరికీ చేరాలనే ఐసీఎంఆర్ సంకల్పానికి వైద్య ఆవిష్కరణల పేటెంట్ మిత్ర ఒక నిదర్శనం" అని వివరించారు.

ఈ కార్యక్రమంలో దేశ బయోమెడికల్ ఆవిష్కరణలు, మేధో సంపత్తి, సాంకేతిక బదిలీ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా 'ఇండియన్ బయోమెడికల్ పేటెంట్ ల్యాండ్‌స్కేప్ రిపోర్టు', 'టెక్నాలజీ కాంపెండియం'లను కూడా విడుదల చేశారు.

ఐసీఎంఆర్ సంస్థలు, పరిశోధకులు అభివృద్ధి చేసిన 41 ప్రజారోగ్య సాంకేతికతలను తదుపరి అభివృద్ధి, తయారీ, వాణిజ్యీకరణ కోసం పారిశ్రామిక భాగస్వాములకు బదిలీ చేయడం ఈ కార్యక్రమంలో కీలకంగా నిలిచింది. ప్రజారోగ్య రంగంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన సమస్యలను పరిష్కరించే అత్యాధునిక రోగనిర్ధారణ పరీక్షలు, టీకాలు, వైద్య పరికరాలు, బయోమెడికల్ పరిష్కారాలు ఈ సాంకేతికతల్లో ఉన్నాయి. ముఖ్యంగా టైఫాయిడ్, పారాటైఫాయిడ్ వ్యాధుల కోసం తయారు చేసిన గ్లైకోకాంజుగేట్, రీకాంబినెంట్ వ్యాక్సీన్లతోపాటు జపనీస్ మెదడు వాపు వ్యాధి, క్షయ, మంకీపాక్స్ వంటి వ్యాధుల రోగనిర్ధారణ సాంకేతికతలను పరిశ్రమలకు అప్పగించారు.

నిర్వీర్యం చేసిన కేఎఫ్‌డీ, చండీపురా వైరస్ నమూనాలతో సహా పరిశీలించిన బయోమెటీరియల్స్‌ను పారిశ్రామిక భాగస్వాములకు బదిలీ చేశారు. ఇది దేశ బయోమెడికల్ పరిశోధన, ఉత్పాదక రంగాన్ని బలోపేతం చేసేందుకు దోహదపడుతుంది. ఐసీఎంఆర్ సంస్థలు, పరిశోధకులు, అంకుర సంస్థలు అభివృద్ధి చేసిన రోగనిర్ధారణ, చికిత్స, వైద్య పరికరాలకు సంబంధించిన 100 కంటే ఎక్కువ సాంకేతికతలను ఈ ప్రదర్శనలో ఉంచారు. ఇది ఆవిష్కర్తలకు, పారిశ్రామిక రంగానికి చెందిన ప్రముఖులకు మధ్య నేరుగా చర్చలు జరపడానికి ముఖ్య వేదికగా నిలిచింది.

బలమైన ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం ద్వారా వికసిత్ భారత్ 2047 సంకల్పాన్ని సాధించడంలో, దేశ బయోమెడికల్ రంగాన్ని బలోపేతం చేయడంలో ఆవిష్కర్తలతో పరిశ్రమల అనుసంధాన కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తుందని నిపుణులు భావిస్తున్నారు.

# రెవెన్యూ అంశాలపై ప్రత్యేక సీఎస్ సమీక్ష




**-22ఏ, వెబ్‌ల్యాండ్ సమస్యల పరిష్కారంపై దిశానిర్దేశం**

**-పట్టాదారు పాస్‌బుక్స్ పంపిణీ వేగవంతం చేయాలని ఆదేశం**

తిరుపతి, మే 26: భూపరిపాలన, రెవెన్యూ శాఖలకు సంబంధించిన పలు కీలక అంశాలపై జిల్లా కలెక్టర్లతో ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్ఏ), రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి. జయలక్ష్మి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన ఈ సమీక్షలో 22ఏ, వెబ్‌ల్యాండ్, రీ సర్వే, పట్టాదారు పాస్‌బుక్స్ పంపిణీ, మాన్యువల్ రికార్డుల డిజిటలైజేషన్, ఐవీఆర్ఎస్ అంశాలపై చర్చించారు. జిల్లాల్లో భూపరిపాలన పనులను వేగవంతం చేయాలని, పెండింగ్ అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని స్పెషల్ సీఎస్ జయలక్ష్మి అధికారులను ఆదేశించారు. రీ సర్వే పనులు, వెబ్‌ల్యాండ్ సమస్యల పరిష్కారం, పట్టాదారు పాస్‌బుక్స్ పంపిణీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

మాన్యువల్ రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని తెలిపారు. భూపరిపాలనకు సంబంధించిన ప్రతి అంశంలో ఖచ్చితత్వం పాటిస్తూ సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్‌తో పాటు జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు, ఆర్డీవోలు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ల్యాండ్ అండ్ సర్వే అధికారులు, పాల్గొన్నారు.

# నూతన రెడ్ క్రాస్ కమిటీతో కలెక్టర్ భేటీ..



చిత్తూరు, మే 26: ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చిత్తూరు జిల్లా శాఖకు నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మంగళవారం జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐఏఎస్‌ను కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా జిల్లా చైర్మన్ డా. ఎం. తేజోమూర్తి, వైస్ చైర్మన్ కె. గోవర్ధన్ బాబి, కోశాధికారి ఆర్. రాజగోపాల్ నాయుడును ఎన్నికల అధికారి ఎం. వెంకటరమణ జిల్లా కలెక్టర్‌కు పరిచయం చేశారు. అనంతరం కలెక్టర్ నూతన కమిటీ సభ్యులను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో జిల్లాలో రక్తదాన శిబిరాలను మరింత విస్తృతంగా నిర్వహించి రక్త నిల్వ సామర్థ్యాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రక్త కొరత లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే అంబులెన్స్ సేవలు, పేదలకు సహాయక కార్యక్రమాలు, ఆరోగ్య సేవలు, ఇతర మానవతా కార్యక్రమాలలో రెడ్ క్రాస్ మరింత చురుకుగా వ్యవహరించాలని కోరారు.

రక్తదాన శిబిరాల నిర్వహణతో పాటు రక్త నిల్వ సామర్థ్యాన్ని పెంపొందించేందుకు అవసరమైన నిధుల కేటాయింపులో జిల్లా యంత్రాంగం నుంచి సహకారం అందిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా కార్యదర్శి ఆర్. సహదేవ నాయుడు, పరిపాలన అధికారి వి. గోపి, జిల్లా క్షేత్ర అధికారి వి. చిరంజీవి, జీవిత సభ్యుడు వి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఖనిజ బ్లాకుల వేలం, నిర్వహణ పురోగతిని సమీక్షించిన కేంద్ర గనుల మంత్రిత్వశాఖ కార్యదర్శి

న్యూ ఢిల్లీ, మే 26:కేంద్ర గనుల మంత్రిత్వశాఖ కార్యదర్శి శ్రీ పీయూష్ గోయల్ ఈ రోజు మంత్రిత్వశాఖ ఉన్నతాధికారులు, కేటగిరీ-ఎ ఖనిజ నిక్షేపాలు ఉన్న రాష్ట్రాల అధికారులతో తొమ్మిదో నెలవారీ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. దేశవ్యాప్తంగా ఖనిజ బ్లాకుల వేలం, వాటి నిర్వహణ పురోగతిని ఈ సమావేశంలో సమీక్షించారు. గనుల రంగంలో సంస్కరణలను వేగవంతం చేయడం, దేశీయ ఖనిజ ఉత్పత్తిని పెంచడం, వేలం వేసిన ఖనిజ బ్లాకులను సకాలంలో అందుబాటులోకి తీసుకురావడంపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు.

2015లో వేలం విధానాన్ని ప్రవేశపెట్టిన తర్వాత 2015-16 ఆర్థిక సంవత్సరం నుంచి 2020-21 ఆర్థిక సంవత్సరం వరకు మొత్తం 108 ఖనిజ బ్లాకులను విజయవంతంగా వేలం వేయడాన్ని సమావేశంలో ప్రముఖంగా ప్రస్తావించారు. ఆ తర్వాత వేలం ప్రక్రియ గణనీయమైన వేగాన్ని పుంజుకుంది. 2021-22 ఆర్థిక సంవత్సరం నుంచి 2024-25 ఆర్థిక సంవత్సరం మధ్య కాలంలో ఏటా సగటున 90 బ్లాకుల చొప్పున మొత్తం 364 ఖనిజ బ్లాకులను విజయవంతంగా వేలం వేశారు.

ఒక్క 2025-26 ఆర్థిక సంవత్సరంలోనే అత్యధికంగా రికార్డు స్థాయిలో 212 ఖనిజ బ్లాకులను విజయవంతంగా వేలం వేశారు. వేలం విధానం ప్రారంభమైనప్పటి నుంచి ఒకే ఆర్థిక సంవత్సరంలో ఇన్ని ఖనిజ బ్లాకులను వేలం వేయడం ఇదే మొదటిసారి. ఈ వేలంలో 22 కీలకమైన, వ్యూహాత్మక ఖనిజ బ్లాకులు కూడా ఉండడం విశేషం. భారత ఆర్థిక వృద్ధికి, స్వచ్ఛ ఇంధన మార్పునకు అవసరమైన కీలక ఖనిజ వనరులను సమకూర్చుకోవడంపై ప్రభుత్వం నిరంతరం చూపున్న శ్రద్ధను ఇది ప్రతిబింబిస్తోంది.

వేలం వేసిన బ్లాకుల నిర్వహణ స్థితిని కూడా ఈ సమావేశంలో సమీక్షించారు. 2015-16 ఆర్థిక సంవత్సరం నుంచి 2024-25 ఆర్థిక సంవత్సరం వరకు 20 గ్రీన్ ఫీల్డ్, 38 బ్రౌన్ ఫీల్డ్ బ్లాకులతో కలిపి మొత్తం 58 బ్లాకులు అందుబాటులోకి రాగా, ఒక్క 2025-26 ఆర్థిక సంవత్సరంలోనే 28 గ్రీన్ ఫీల్డ్, 8 బ్రౌన్ ఫీల్డ్ బ్లాకులతో కలిపి మొత్తం 36 ఖనిజ బ్లాకులు నిర్వహణలోకి వచ్చినట్లు ఈ సందర్భంగా తెలిపారు.

చట్టబద్ధమైన అనుమతులను వేగవంతం చేయడానికి, గనుల తవ్వకాలను త్వరితగతిన ప్రారంభించడానికి, వేలం వేసిన బ్లాకుల నుంచి సకాలంలో ఉత్పత్తిని సాధించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సన్నిహిత సమన్వయం అవసరమని గనుల శాఖ కార్యదర్శి స్పష్టం చేశారు.

# జగన్‌ను కలిసిన సుగాలి ప్రీతి తల్లి

అమరావతి, మే 26: మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డిని సుగాలి ప్రీతి తల్లిదండ్రులు కలిసి తమ కుమార్తె కేసులో న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. 2017లో టీడీపీ ప్రభుత్వ హయాంలో తమ కుమార్తెపై హత్యాచారం జరిగి తొమ్మిదేళ్లు గడిచినా ఇప్పటికీ న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

కేసు విషయంలో ప్రస్తుత చంద్రబాబు ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వారు ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ కేసును సీబీఐకి అప్పగిస్తూ జీవో జారీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేసును పక్కనపెట్టిందని సుగాలి ప్రీతి తల్లిదండ్రులు ఆరోపించారు. తమ కుమార్తెకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని జగన్‌ను కోరినట్లు సమాచారం.

# డీఎంఈగా డా॥విష్ణువర్ధన్ నియామకం

అమరావతి, మే 26: ఆంధ్రప్రదేశ్ వైద్యారోగ్య శాఖలో భారీ స్థాయిలో బదిలీలు, పదోన్నతులు చేపట్టారు. పలు కీలక పోస్టులకు కొత్త అధికారులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వైద్య విద్య, ఆసుపత్రుల పరిపాలన వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా ఈ మార్పులు చేపట్టినట్లు తెలుస్తోంది.

డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ)గా డా.అత్తలూరి విష్ణువర్ధన్‌ను ప్రభుత్వం నియమించింది. పదోన్నతి పొందిన 15మంది ఏడీఎంఈలకు కూడా పోస్టింగ్‌లు కేటాయించింది. రాష్ట్రవ్యాప్తంగా నలుగురు కొత్త మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్స్, తొమ్మిది మంది సూపరింటెండెంట్ల నియామకాలు చేపట్టింది.

విజయవాడ జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా డా. రఘునందన్‌ను నియమించగా, కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్‌గా డా. ఉషాకిరణ్ బాధ్యతలు చేపట్టనున్నారు. అలాగే విశాఖలోని విమ్స్ డైరెక్టర్‌గా డా.మన్మథరావును నియమించింది ప్రభుత్వం. ఈ మార్పులతో ప్రభుత్వ వైద్య సేవలు, మెడికల్ విద్యా వ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేస్తుందని అధికారులు భావిస్తున్నారు.

# బెంగళూరు సమీక్షల సందర్భంగా పెండింగ్‌లో ఉన్న మైనింగ్, అన్వేషణ ప్రాజెక్టులను వేగవంతం చేయాలని సంబంధిత సంస్థలను ఆదేశించిన కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి



న్యూఢిల్లీ, మే 26:భారతదేశ ఖనిజ భద్రతను, వ్యూహాత్మక వృద్ధి లక్ష్యాలను బలోపేతం చేయటానికి పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను వేగవంతం చేయాలని, మిషన్ మోడ్ విధానాన్ని అవలంబించాలని మంత్రిత్వ శాఖ పరిధిలోని అన్ని మైనింగ్, ఎక్స్‌ప్లోరేషన్ సంస్థలను సోమవారం కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి ఆదేశించారు.

"అన్ని సంస్థలు పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను వేగవంతం చేయాలి. సాంకేతికత, పారదర్శకత, సామర్థ్యాలు ప్రతి సంస్థాగత ప్రక్రియకు పునాదిగా నిలిచేలా చూడాలి. ఈ రంగంలో పనిచేస్తున్న ప్రతి ఏజెన్సీ నుంచి భారతదేశ ప్రజలు, భారత ప్రభుత్వం.. వేగం, జవాబుదారీతనం, స్పష్టమైన ఫలితాలను ఆశిస్తున్నాయి" అని కేంద్రమంత్రి అన్నారు. బెంగళూరులో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ), నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్ (ఎన్ఐఆర్ఎం), ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్ (ఐబీఎం), రిమోట్ సెన్సింగ్ అండ్ ఏరియల్ సర్వే (ఆర్ఎస్ఏఎస్) విభాగాల సీనియర్ అధికారులతో నిర్వహించిన వరుస ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాలకు అధ్యక్షత వహిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు.

ఖనిజాల అన్వేషణను వేగవంతం చేయటం, శాస్త్రీయ, సాంకేతిక సామర్థ్యాలను బలోపేతం చేయటం, స్థిరమైన మైనింగ్ పద్ధతులను ప్రోత్సహించటం, వికసిత్ భారత్-2047 జాతీయ సంకల్పానికి అనుగుణంగా సంస్థాగత ప్రయత్నాలను ఒకే తాటిపైకి తీసుకురావటంపై ఈ సమావేశాలు దృష్టి సారించాయి.

సమావేశం సందర్భంగా దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ప్రాజెక్టులు, సాంకేతిక పురోగతులు, అన్వేషణ కార్యకలాపాలను మంత్రి సమీక్షించారు. ముఖ్యంగా అరుదైన భూ మూలకాలు (ఆర్ఈఈ), లిథియం, నికెల్, కోబాల్ట్, టంగ్‌స్టన్, వెనడియం, ప్లాటినం గ్రూప్ ఎలిమెంట్స్ (పీజీఈ) వంటి కీలక, వ్యూహాత్మక ఖనిజాల రంగానికి సంబంధించి సమీక్ష చేశారు. భారతదేశ ఖనిజ భద్రతను, వ్యూహాత్మక వృద్ధి లక్ష్యాలను బలోపేతం చేసేందుకు అమలు చేస్తున్న వనరుల పెంపు, ఖనిజ నిర్ధారణ, శాస్త్రీయ సర్వేలు, గనుల సుస్థిరత, జియోస్పేషియల్ టెక్నాలజీలు, అధునాతన అన్వేషణ వ్యవస్థలపై మంత్రికి సమగ్ర నివేదికను సంబంధిత సంస్థలు సమర్పించాయి.

అధికారులను ఉద్దేశించి శ్రీ జి. కిషన్ రెడ్డి మాట్లాడారు. "గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వం, దూరదృష్టితో భారత్ స్వావలంబన, ప్రపంచవ్యాప్తంగా పోటీతత్వం గల ఆర్థిక వ్యవస్థ దిశగా దృఢంగా సాగుతోంది. భారతదేశ భవిష్యత్ వృద్ధి, పారిశ్రామిక విస్తరణ, వ్యూహాత్మక ఖనిజ భద్రతకు గనుల తవ్వకం, అన్వేషణ రంగాలు కీలక పాత్ర పోషిస్తాయి" అని అన్నారు.

అన్ని సంస్థలు స్పష్టమైన సమయపాలన, కొలవగల ఫలితాలు, మరింత జవాబుదారీతనంతో సమన్వయంతో మిషన్-మోడ్ విధానంలో పనిచేయాలని ఆదేశించారు.

భారతదేశ అన్వేషణ వ్యవస్థను బలోపేతం చేయటంలో అధునాతన సాంకేతికతలు, డేటా ఇంటిగ్రేషన్, శాస్త్రీయ ఆవిష్కరణల ప్రాముఖ్యతను మంత్రి స్పష్టం చేశారు.

"ఏఐ, రిమోట్ సెన్సింగ్, ఇంటిగ్రేటెడ్ జియోసైన్స్ అనలిటిక్స్, అధునాతన అన్వేషణ పద్ధతుల్లో సాంకేతిక ఆధారిత వ్యవస్థలపైనే ఖనిజ తవ్వకాల భవిష్యత్ ఆధారపడి ఉంది. భారతదేశాన్ని భవిష్యత్తుకు సిద్ధంగా ఉంచేందుకు, వనరుల పరంగా సురక్షితంగా ఉండేలా చేసే దిశగా పరివర్తనలో మన సంస్థలు ముందుండాలి" అని ఆయన అన్నారు.

ఎంఎండీఆర్ సవరణ చట్టం-2015 ద్వారా ప్రవేశపెట్టిన సంస్కరణల తర్వాత కర్ణాటక, గోవాలో ఖనిజ వనరులు గణనీయంగా పెరగటంతో పాటు బంగారం, రాగి, పీజీఈ, నికెల్, కోబాల్ట్ వంటి ఖనిజ నిక్షేపాలను గుర్తించినట్లు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా పేర్కొంది. దీనితో పాటు దాదాపు 48,000 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తృత-స్థాయి థీమాటిక్ మ్యాపింగ్, ఏఐ, ఎంఎల్ ఆధారిత ఖనిజ అన్వేషణ, అధునాతన దశల తవ్వకాల ప్రాజెక్టులతో ఐదేళ్ల కార్యాచరణ ప్రణాళికను కూడా జీఎస్ఐ వివరించింది.

జాతీయ ప్రాధాన్యత గల మౌలిక సదుపాయాలు, గనుల భద్రతా ప్రాజెక్టులకు అందించిన సహకారాన్ని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్ ప్రదర్శించింది. ఇందులో జలవిద్యుత్, మెట్రో రైల్, టన్నెల్ ఇంజనీరింగ్, భూకంప పర్యవేక్షణ, సున్నితమైన మౌలిక సదుపాయాల సమీపంలో నియంత్రిత పేలుళ్ల వంటి రంగాలున్నాయి. దీనితో పాటు వ్యూహాత్మక జాతీయ అభివృద్ధి ప్రాజెక్టులకు మద్దతుగా రాక్ మెకానిక్స్, ఇంజనీరింగ్ జియాలజీ (భూగర్భ శాస్త్రం), సూక్ష్మ భూకంపాల పర్యవేక్షణ, జియోటెక్నికల్ పరిష్కారాల్లోని సామర్థ్యాలను ఈ సంస్థ తెలియజేసింది.

పర్యావరణ పరిరక్షణ చర్యలు, వేలం వేసిన ఖనిజ బ్లాకులను అందుబాటులోకి తీసుకురావటం, శాస్త్రీయ పద్ధతిలో గనుల మూసివేత, ఖనిజ శుద్ధీకరణ, సుస్థిర గనుల విధానాల్లో సాధించిన పురోగతిని భారతీయ గనుల బ్యూరో సమీక్షించింది. జాతీయ కీలక ఖనిజాల మిషన్ ద్వారా ప్రస్తుతమున్న మైనింగ్ వ్యవస్థల నుంచి కీలకమైన ఖనిజాల సుసంపన్నత, వెలికితీత సామర్థ్యానికి సంబంధించిన పరిశోధన ఫలితాలను ఐబీఎం సమర్పించింది.

నేషనల్ ఏరో-జియోఫిజికల్ మ్యాపింగ్ ప్రోగ్రాం (ఎన్ఏజీఎంపీ) ద్వారా సాధించిన పురోగతిని ఆర్ఎస్ఏఎస్ విభాగం సమర్పించింది. ఇందులో వైమానిక భూభౌతిక సర్వేలు, హైపర్‌స్పెక్ట్రల్ రిమోట్ సెన్సింగ్, ఏఐ, ఎంఎల్ ఆధారిత ఖనిజ అన్వేషణ మ్యాపింగ్ వంటి అంశాలున్నాయి. ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటికే 6.5 లక్షల చదరపు కిలోమీటర్లకు పైగా ప్రాంతాన్ని కవర్ చేసినట్లు, ఏరో-జియోఫిజికల్ డేటాసెట్లను ఉపయోగించి 200కు పైగా ఖనిజ అన్వేషణ ప్రాజెక్టులను రూపొందించినట్లు ఈ సమీక్ష స్పష్టం చేసింది. బెంగళూరు పర్యటనలో భాగంగా గౌరవ కేంద్రమంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ ఇంటర్నేషనల్ సెంటర్‌ను సందర్శించి.. అక్కడి ఆర్ట్ ఆఫ్ లివింగ్ కుటుంబసభ్యులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన గురుకులాన్ని, ఎగ్జిబిషన్ సెంటర్‌ను సందర్శించారు. భారత సాంస్కృతిక వారసత్వానికి కట్టుబడి.. విలువలతో కూడిన విద్య, ఆధ్యాత్మిక అవగాహన, సామాజిక మార్పు కోసం ఈ సంస్థ చేస్తున్న కృషిని మంత్రి అభినందించారు. ఈ పర్యటన గురించి ప్రస్తావిస్తూ.. "వికసిత్ భారత్-2047 దిశగా సాగుతున్న భారత అభివృద్ధి ప్రయాణం కేవలం ఆర్థిక పురోగతి, సాంకేతిక పురోభివృద్ధితో మాత్రమే కాక... ఆధ్యాత్మిక చైతన్యం, సాంస్కృతిక విలువలు, సమాజం పట్ల సామూహిక సేవాభావంతోనూ ముందుకు సాగాలి" అని శ్రీ జి. కిషన్ రెడ్డి అన్నారు. వికసిత్ భారత్-2047 విజన్‌కు అనుగుణంగా శాస్త్రీయ పురోగతి, సుస్థిరాభివృద్ధి, సాంస్కృతిక విలువలు, సంస్థాగత ప్రతిభ ద్వారా దేశాన్ని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ఈ పర్యటన ముగిసింది.

# బాధిత పోలీసు కుటుంబాలకు అండగా పోలీస్ శాఖ..



చిత్తూరు, మే 26: చిత్తూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం ఐడీఆర్ఎఫ్ నిధుల నుంచి బాధిత పోలీసు కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేశారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఐపీఎస్ చేతుల మీదుగా రూ.1,30,000 చెక్కులను సంబంధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

సదుం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ హెచ్‌సీ-269 పి.టి. గిరిబాబు కుటుంబానికి ఐడీఆర్ఎఫ్ నిధుల నుంచి రూ.1 లక్ష చెక్కును ఆయన సతీమణి శాంతికి ఎస్పీ అందజేశారు.

అలాగే సోమల పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలో ఇంటికి వెళ్తూ రోడ్డు ప్రమాదానికి గురైన పీసీ-3832 పి. రమేష్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.30 వేల ఆర్థిక సహాయం చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ తుషార్ డూడి మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. అవసరమైన సహాయ సహకారాలను అన్ని విధాలుగా అందిస్తామని భరోసా ఇచ్చారు. పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం శాఖ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ మరియు ఇన్‌చార్జ్ అడ్మిన్ ఎన్.ఆర్. రాజశేఖర రాజు, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉదయ్ కుమార్, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఒట్టావాలో పీయూష్ గోయల్ ఉన్నత స్థాయి చర్చలు... భారత్-కెనడా సీఈపీఏ

## ఒప్పందాన్ని గేమ్ ఛేంజర్‌గా అభివర్ణించిన కెనడా ప్రధాని మార్క్ కార్నీ

న్యూఢిల్లీ, మే 26:భారత-కెనడా ఆర్థిక సంబంధాల పునరుద్ధరణ దిశగా కీలక ముందడుగు వేస్తూ.. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ కెనడాలోని ఒట్టావా పర్యటనకు వెళ్లారు. 100కు పైగా కంపెనీల పరిశ్రమల అధిపతులతో ఇప్పటివరకు కెనడాకు వెళ్లిన అతిపెద్ద భారత వాణిజ్య ప్రతినిధి బృందానికి ఆయన నాయకత్వం వహిస్తున్నారు. భారత్, కెనడాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్య, ఆర్థిక సంబంధాలను పెంపొందించడమే మే 25న ఒట్టావా.. 26, 27 తేదీల్లో టొరంటో నగరాల్లో సాగే మూడు రోజుల పర్యటన ముఖ్య ఉద్దేశం. భారత్-కెనడా సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సీఈపీఏ) కోసం ప్రస్తుత చర్చలను వేగవంతం చేయటంపై ఈ పర్యటన దృష్టి సారిస్తుంది.

మొదటి రోజు ఒట్టావా పర్యటన సందర్భంగా వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతికత, వ్యవసాయం, వ్యూహాత్మక రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేసేందుకు కెనడా సీనియర్ నేతలు, మంత్రులతో శ్రీ గోయల్ వరుస ఉన్నత స్థాయి సమావేశాలు నిర్వహించారు.

కెనడా ప్రధానమంత్రి గౌరవ మార్క్ కార్నీని కలిసిన సందర్భంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ తరఫున కేంద్రమంత్రి శ్రీ పీయూష్ గోయల్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఇటీవల ప్రధానమంత్రి కార్నీ భారత్ పర్యటనను ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేసుకున్నారు. ఆ పర్యటన భారత్-కెనడా భాగస్వామ్యానికి నూతనోత్తేజాన్ని, నూతన విశ్వాసాన్ని అందించిందన్నారు. పలు రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేయటంపై ఇరుపక్షాలు భవిష్యత్ కార్యాచరణతో కూడిన చర్చలు జరిపారు. భారత్-కెనడా సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (సీఈపీఏ) త్వరలోనే ముగుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

భారతదేశంతో ప్రతిపాదిత స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం గేమ్ ఛేంజర్ అవుతుందని, ఇది భారీ నూతన మార్కెట్‌ను అందుబాటులోకి తెస్తుందని ప్రధానమంత్రి కార్నీ స్పష్టం చేశారు. సమతుల్య, వాణిజ్య పరంగా అర్థవంతమైన, ప్రతిష్ఠాత్మకమైన సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం పట్ల ఇరుపక్షాలు నిబద్ధతను వెల్లడించాయి. ఆర్థిక భాగస్వామ్యాలను బలోపేతం చేస్తూ రెండు దేశాల వాణిజ్యానికి, పౌరులకు స్పష్టమైన ప్రయోజనాలను చేకూర్చే విధంగా ఒప్పందాన్ని రూపొందించేందుకు కృషి చేయాలని ఆయా దేశాల బృందాలను ఆదేశించాయి.

భారత్-కెనడా సీఈపీఏ చర్చలను ముందుకు తీసుకెళ్లటంపై కెనడా అంతర్జాతీయ వాణిజ్య శాఖ మంత్రి శ్రీ మణీందర్ సిద్ధూతో శ్రీ పీయూష్ గోయల్ నిర్మాణాత్మక ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఇరుదేశాల మంత్రులు ఇప్పటివరకు పూర్తయిన చర్చల ఫలితాలను సమీక్షించడంతో పాటు వాణిజ్యం, పెట్టుబడుల విస్తరణపై భవిష్యత్తు అవకాశాలను గుర్తించారు. 2026 చివరి నాటికి సమతుల్యమైన, పరస్పర ప్రయోజనకరమైన ఒప్పందాన్ని ముగించాలన్న నిర్ణయాన్ని ఇరుపక్షాలు స్పష్టం చేశాయి.

ప్రతిపాదిత సీఈపీఏ.. ఆర్థిక భాగస్వామ్యాలను బలోపేతం చేయటమే కాక, ఉభయదేశాల వాణిజ్యానికి, పౌరులకు స్పష్టమైన ప్రయోజనాలను చేకూరుస్తూ, ద్వైపాక్షిక ఆర్థిక సంబంధాలను ఉన్నత స్థాయికి తీసుకెళ్తుంది.

కెనడా వ్యవసాయ, అగ్రి-ఫుడ్ శాఖ మంత్రి గౌరవ శ్రీ హీత్ మెక్‌డొనాల్డ్‌తో జరిగిన నిర్ణయాత్మక సమావేశంలో.. ఆహార భద్రత, సుస్థిరత, వ్యవసాయ సాంకేతికతలపై ప్రధానంగా దృష్టి సారిస్తూ వ్యవసాయ రంగంలో ద్వైపాక్షిక సహకారాన్ని బలోపేతం చేయటంపై చర్చలు జరిగాయి. ఆహార శుద్ధి రంగంలో పరస్పర సహకారానికి అర్థవంతమైన అవకాశాలను ఇరుపక్షాలు అన్వేషించాయి. ఇటువంటి సహకారం భారతదేశ రైతులు, ఉత్పత్తిదారుల ఆదాయాలను పెంచటంలో కీలక పాత్ర పోషిస్తుందని, రెండు దేశాల మధ్య వ్యవసాయ అనుసంధానాన్ని మరింత పెంపొందించేందుకు దోహదపడుతుందని స్పష్టం చేశారు.

కెనడా విదేశాంగ మంత్రి శ్రీమతి అనితా ఆనంద్‌తో శ్రీ పీయూష్ గోయల్ విస్తృత స్థాయి చర్చలు జరిపారు. భారత్-కెనడా వ్యూహాత్మక భాగస్వామ్యానికి వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక అనుసంధానతల ప్రాముఖ్యతను తెలియజేశారు. భారత్‌లో విస్తరిస్తున్న మౌలిక సదుపాయాలు, పునరుత్పాదక ఇంధనం, రవాణా, డిజిటల్ మౌలిక సదుపాయాలు, వినియోగదారుల రంగాలు.. కెనడా దీర్ఘకాలిక పెట్టుబడులకు, మరింత సహకారానికి గొప్ప అవకాశాలను కల్పిస్తున్నాయని మంత్రి అన్నారు. ఆర్థిక, వ్యూహాత్మక కోణాల్లో ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయాలనే నిబద్ధతను ఇరుపక్షాలు స్పష్టం చేశాయి.

ఒట్టావాలో మొదటి రోజు పర్యటనను శ్రీ పీయూష్ గోయల్ విజయవంతంగా ముగించారు. ఈ సందర్భంగా కెనడా అంతర్జాతీయ వాణిజ్య శాఖ మంత్రి శ్రీ మణీందర్ సిద్ధూ ఏర్పాటు చేసిన విందు కార్యక్రమంలో ఆత్మీయంగా సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో శ్రీ పీయూష్ గోయల్ మాట్లాడుతూ.. భారతదేశ అద్భుతమైన వృద్ధి ప్రయాణాన్ని ప్రస్తావించారు. ప్రజల ఆకాంక్షలు, వృద్ధి చెందుతున్న కార్యాచరణ స్ఫూర్తి, విస్తృతమైన, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, విస్తరిస్తున్న మార్కెట్ అవకాశాలే ఈ వృద్ధికి శక్తి అని పేర్కొన్నారు. ఇరుదేశాల మధ్య ఆర్థిక, సాంస్కృతిక, పరస్పర సంబంధాలను మరింత బలోపేతం చేయటంలో ప్రవాస భారతీయులు అందిస్తున్న విశేష సహకారాన్ని శ్రీ పీయూష్ గోయల్ ఈ సందర్భంగా ప్రస్తావించారు.

మే 26, 27 తేదీల్లో టొరంటోలో పరిశ్రమల రౌండ్ టేబుల్ సమావేశాలు, బీ2బీ చర్చలతో క్రియాశీల కార్యక్రమానికి శ్రీ పీయూష్ గోయల్ ప్రాతినిధ్యం వహించనున్నారు. మంత్రిత్వ శాఖల స్థాయిలోని నిర్ణయాలను, ప్రాధాన్యత గల రంగాల్లో నిర్దిష్టమైన వాణిజ్య భాగస్వామ్యాలుగా మార్చటమే దీని లక్ష్యం.

మార్చి 2026లో ప్రధానమంత్రి మార్క్ కార్నీ న్యూఢిల్లీ పర్యటన సందర్భంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీని కలిసి నిర్దేశించిన కార్యాచరణను ఈ పర్యటన ముందుకు తీసుకెళుతుంది. 2025 మధ్యకాలం నుంచి ఇరుదేశాల మధ్య కొనసాగుతున్న ఉన్నత స్థాయి చర్చలను ఇది మరింత పటిష్ఠం చేస్తుంది.

మార్చి 2025లో విధి విధానాల పత్రంపై సంతకాలు జరిగినప్పటి నుంచి సీఈపీఏ చర్చలు అత్యంత వేగంగా ముందుకు సాగాయి. మార్చి 2026లో మొదటి విడత ఆన్‌లైన్ చర్చలు జరగ్గా.. మే 8, 2026 నాటికి రెండో విడత చర్చలు ముగిశాయి. కేంద్రమంత్రి పీయూష్ గోయల్ పర్యటనతో పాటు ప్రస్తుతం మే 25 నుంచి 29 వరకు ఒట్టావాలో సాంకేతికపరమైన చర్చలు కొనసాగుతున్నాయి. ఈ ప్రక్రియ పట్ల ఇరుపక్షాలు ప్రదర్శిస్తున్న చిత్తశుద్ధిని, వేగాన్ని ఈ చర్చలు స్పష్టం చేస్తున్నాయి.

ఇరుపక్షాలు విస్తృతమైన అవకాశాలను పెంచుకునేందుకు.. ఇంధనం, గనుల తవ్వకం, ఆటోమొబైల్స్, ఔషధ రంగం, టెలి కమ్యూనికేషన్స్, కృత్రిమ మేధ, తోలు, వస్త్ర పరిశ్రమలతో సహా వివిధ రంగాలకు చెందిన 100 మందికి పైగా పరిశ్రమల అగ్రనేతల ప్రతినిధి బృందం అక్కడకు వెళ్లింది.

ప్రస్తుతం ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం సుమారు 8.5 బిలియన్ అమెరికన్ డాలర్లుగా ఉండగా.. 2030 నాటికి 50 బిలియన్ డాలర్లకు విస్తరించాలని ఇరుదేశాల ప్రభుత్వాలు ప్రతిష్టాత్మక లక్ష్యాన్ని నిర్దేశించుకున్నాయి.

# ప్రజల చైతన్యమే లక్ష్యంగా సిద్దేశ్వరం అలుగు మహాసభ

## -ప్రజా శంకుస్థాపన 10వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహణకు ఏర్పాట్లు




అమరావతి, మే 26: రాయలసీమ సాగునీటి సమస్యల పరిష్కారం, ప్రాంత సమగ్రాభివృద్ధి లక్ష్యంగా నిర్వహిస్తున్న సిద్దేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన 10వ వార్షికోత్సవ మహాసభ ఈ నెల 31న ఘనంగా నిర్వహించనున్నట్లు రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులు తెలిపారు.

మంగళవారం సమితి కార్యాలయంలో జరిగిన సమావేశంలో 2016 మే 31న జరిగిన ప్రజా శంకుస్థాపన ఉద్యమానికి సంబంధించిన వీడియోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కృష్ణా, తుంగభద్ర నదులు రాయలసీమ గుండా ప్రవహిస్తున్నప్పటికీ ప్రాంతం ఇప్పటికీ కరువుతో సహజీవనం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దేశ్వరం అలుగు నిర్మాణమే రాయలసీమ సమగ్రాభివృద్ధికి మార్గమని వారు స్పష్టం చేశారు.

ప్రభుత్వాలకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా స్పందన లేకపోవడంతో 2016లో వేలాది మంది ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని ప్రజా శంకుస్థాపన నిర్వహించారని గుర్తుచేశారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం వార్షికోత్సవ కార్యక్రమాల ద్వారా సాగునీటి సమస్యలపై ప్రజాస్వామ్య ఒత్తిడి కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 31న జరిగే మహా సభకు మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి గోపాల గౌడ, ఏపీ రైతు కూలీ సంఘం అధ్యక్షురాలు ఝాన్సీ, హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయం ఆచార్యులు వెంకటేష్ తదితరులు హాజరై సందేశాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. రాయలసీమ సాగునీటి సమస్యలు, ప్రాంత అభివృద్ధిపై ప్రజల్లో అవగాహన కల్పించే ఈ మహాసభలో రైతులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ప్రభుత్వం, ప్రతిపక్షాలు రాయలసీమ సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శిస్తూ ప్రజలే చైతన్యవంతమై తమ హక్కులను సాధించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షులు యర్రం శంకర్ రెడ్డి, ఏరువ రామచంద్రారెడ్డి, నిట్టూరు సుధాకర్ రావు, బెక్కం రామసుబ్బారెడ్డి, న్యాయవాది అనదుల్లా తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో 100 శాతం విద్యార్థుల నమోదు పూర్తి చేయాలి

## -ఎన్రోల్మెంట్ డ్రైవ్‌ను సకాలంలో పూర్తి చేయాలని సూచన




నంద్యాల,మే 26: జిల్లాలోని 29 మండలాల్లో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల ఎన్రోల్మెంట్‌ను యాప్‌లో సకాలంలో పూర్తి చేయాలని జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ నిత్యానంద రాజ్, జిల్లా విద్యాధికారి జనార్ధన్ రెడ్డి సూచించారు.

మంగళవారం స్థానిక కార్యాలయ సమావేశ భవనంలో ఐఈఆర్పీలకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో మే 5 నుంచి జూన్ 10 వరకు నిర్వహిస్తున్న ఎన్రోల్మెంట్ డ్రైవ్‌లో ప్రతి ప్రత్యేక అవసరాలున్న విద్యార్థి తప్పనిసరిగా నమోదు కావాలన్నారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సేవ చేయడం ఒక గొప్ప బాధ్యత అని పేర్కొంటూ, వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపి వారి భవిష్యత్తు అభివృద్ధికి తోడ్పాటు అందించాలని సూచించారు.

అలాగే భవిత కేంద్రాల్లో అన్ని రికార్డులను సమర్థవంతంగా నిర్వహించాలని, విద్యార్థులకు అందాల్సిన ఉపకరణాలు, ఉపకారవేతనాలు ఎవరూ మిగలకుండా అందేలా చూడాలని తెలిపారు.

ఇటీవల రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో సమగ్ర శిక్ష కార్యక్రమం కింద ఎవరెస్ట్ బేస్ క్యాంప్ అధిరోహణకు ఎంపికైన 21 మంది విద్యార్థుల్లో జిల్లాకు చెందిన 7 మంది ఎంపిక కావడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ విజయానికి కృషి చేసిన ఐఈఆర్పీలను అభినందించారు.

జిల్లా ఐఈ సమన్వయకర్త జగన్మోహన్ రెడ్డి ఇప్పటివరకు జరిగిన ఎన్రోల్మెంట్ పురోగతిపై మండలాల వారీగా వివరించారు. సర్వే సమయంలో ఎదురవుతున్న సమస్యలను రాష్ట్ర అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

అధికారుల సూచనల మేరకు ప్రత్యేక అవసరాలు గల పిల్లల ఎన్రోల్మెంట్‌తో పాటు వారి విద్యాభివృద్ధికి ఐఈఆర్పీలు ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఏఎంఓ మాధవి, జిల్లా ఐఈ సహాయ సమన్వయకర్త శ్రీనివాసులు, ఆయా మండలాల ఐఈఆర్పీలు పాల్గొన్నారు.

# రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకోవాలి: సీపీఎం

నల్గొండ, మే 26:మండలంలో రైతుల నుంచి అదనపు తూకం (42 కిలోలు) వేసేలా ఒత్తిడి తెస్తున్న రైస్ మిల్లర్లపై వెంటనే చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మంచి ధాన్యానికీ బి గ్రేడ్ కింద కొనుగోలు చేసి రైతులను నష్టపరుస్తున్నారని, లారీ కొరత పేరుతో కొనుగోళ్ల ఆలస్యం చేస్తున్నారని విమర్శించారు. నెలరోజులుగా ధాన్యం అమ్ముడు కాక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైస్ మిల్లర్లు, ఐకేపీ అధికారులపై చర్యలు తీసుకుని, యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోలు చేపట్టాలని సీపీఎం డిమాండ్ చేసారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు బొమ్మిడి సాయికృష్ణ, సంఘ ఎల్లయ్య, బొనగిరి లింగం, బండి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# మహబూబ్‌నగర్‌లో ఏటీఎం చోరీ కలకలం

## -సీసీ కెమెరాలు ధ్వంసం చేసి ఎస్‌బీఐ ఏటీఎంలో నగదు దోపిడీ

మహబూబ్‌నగర్, మే 26: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో మంగళవారం తెల్లవారుజామున దొంగల ముఠా ఏటీఎంను ధ్వంసం చేసి నగదును దోచుకెళ్లిన ఘటన కలకలం రేపింది. జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఏటీఎంను లక్ష్యంగా చేసుకున్న దుండగులు ముందుగా అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, ఇతర పరికరాలను ధ్వంసం చేశారు. అనంతరం ఏటీఎంను పగలగొట్టి అందులో ఉన్న నగదును ఎత్తుకెళ్లారు.

ఉదయం ఘటన వెలుగులోకి రావడంతో బ్యాంకు అధికారులు, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల షాద్‌నగర్‌లో జరిగిన ఏటీఎం చోరీ ఘటనకు పాల్పడిన ముఠాయే ఈ దోపిడీకి కూడా కారణమై ఉండొచ్చని అనుమానాలు వ్యక్తమవు తున్నాయి. సమాచారం అందుకున్న టూ టౌన్ పోలీసులు క్లూస్ టీం సహకారంతో సంఘటన స్థలంలో ఆధారాలు సేకరిస్తున్నారు. జిల్లా కేంద్రం నడిబొడ్డునే ఈ ఘటన చోటుచేసుకోవడంతో పట్టణంలో సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

# భారీ గాలి వాన బీభత్సం..

నల్గొండ, మే 26: భారీ అకాల గాలివాన మంగళవారం సాయంత్రం జన్నారం మండలంలో బీభత్సం సృష్టించింది. ఓ గంట పాటు భారీ ఈదురు గాలులతో అకాల వర్షం కురియడంతో పలుచోట్ల రోడ్డుకు అడ్డంగా,విద్యుత్ స్తంభాలపై పెద్ద చెట్లు విరిగిపడ్డాయి.దీంతో విద్యుత్ సరఫరకు తీవ్ర అంతరాయం కలిగింది. మండలంలోని పొనకల్ సమీపాన ఉన్న ఎస్.కె ఫంక్షన్ హాల్ ధ్వంసం అయ్యింది.దీంతో రూ. 60 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని ఆ ఫంక్షన్ హాల్ యజమాని ఎస్కే బాషారత్ తెలిపారు.మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో పెద్దపెద్ద చెట్లు విద్యుత్ స్తంభాలపై,రోడ్డుకు అడ్డంగా పడి అంతరాయం ఏర్పడింది.కొనుగోలు కేంద్రా ల్లోని వడ్లు,మక్కలు వర్షానికి నానాయి. దీంతో ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు.ముఖ్యంగా రైతులు పడరాని పాట్లు పడ్డారు. విద్యుత్ శాఖ,పోలీసులు రెవెన్యూ శాఖ అధికారులు అప్రమత్తమై చెట్లను నరికి వేయిస్తూ తొలగిస్తున్నారు.

# రైల్వే స్టేషన్‌లో రక్తపోటు స్క్రీనింగ్, అవగాహన కార్యక్రమం

## -రక్తపోటు నియంత్రణతో అకాల మరణాలను తగ్గించవచ్చని వైద్యుల సూచన




చిత్తూరు,మే 26: ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకుని చిత్తూరు రైల్వే స్టేషన్‌లో మంగళవారం రక్తపోటు నివారణ వారోత్సవాల సందర్భంగా స్క్రీనింగ్, అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగ శశిభూషణ్ రెడ్డి ఆదేశాల మేరకు ఎన్‌సీడీ కోఆర్డినేటర్ డాక్టర్ గిరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. రైల్వే స్టేషన్‌లో ఉన్న ప్రయాణికులు, సిబ్బందికి రక్తపోటు పరీక్షలు నిర్వహించి ఆరోగ్య పరిస్థితులను పరిశీలించారు. అలాగే అధిక రక్తపోటు వల్ల కలిగే ప్రమాదాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

డాక్టర్ గిరి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మే 17న ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అధిక రక్తపోటు అనేది గుండె జబ్బులు, పక్షవాతం, మూత్రపిండ సమస్యలు వంటి ప్రాణాంతక వ్యాధులకు దారితీసే "సైలెంట్ కిల్లర్" అని పేర్కొన్నారు. ప్రజల్లో అవగాహన పెంచి, ముందస్తుగా గుర్తించి నివారించడమే ఈ వారోత్సవాల ముఖ్య ఉద్దేశమని వివరించారు. ప్రస్తుత జీవనశైలి మార్పులు, మానసిక ఒత్తిడి, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్ల కారణంగా యువతలో కూడా రక్తపోటు సమస్య పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సాధారణ రక్త పోటు పరిమితి 120/80 ఎఎఊణగా ఉంటుందని తెలిపారు. రక్తపోటు నియంత్రణకు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవడం, ఉప్పు వినియోగం తగ్గించడం, నిత్య వ్యాయామం, యోగా, ధ్యానం ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవాలని సూచించారు.

ఈ అంశాలపై గ్రామీణ స్థాయి వరకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎపిడెమియాలజిస్ట్ శ్రీవాణి, సూపర్వైజర్ మురళి, తన్వి, లావణ్య, గోపి, సుందర్, హెల్త్ సెక్రటరీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# వరుస దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

ఆదిలాబాద్, మే 26:మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలంలోని కిష్టంపేట గ్రామంలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న దొంగను పట్టుకున్నట్లు సీఐ బన్సీలాల్ తెలిపారు. ఇవ్వాళ స్థానిక పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో సీఐ బ్యాన్సిలాల్ దొంగ వివరాలను వెల్లడించారు. కిష్టంపేట గ్రామానికి చెందిన కల్యాణం రమేష్ అనే దొంగను పట్టుకుని విచారించగా కిష్టంపేట గ్రామంలో 4 దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నాడని పేర్కొన్నరు. నిందితుని వద్ద నుండి సుమారు ఒక లక్ష ముప్పై ఎనిమిది వేల రూపాయల విలువగల వస్తువులను రికవరీ చేసినట్లు తెలిపారు. నిందితుని పైన పట్టణ పోలీస్ స్టేషన్ లో నాలుగు కేసులు ఉన్నట్లు, నిందితుని రిమాండ్ కు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. దొంగను చాకచక్యంగా పట్టుకున్న ఎస్సై శ్యాం పటేల్ ను సిబ్బందిని ఈ సందర్భంగా సీఐ బన్సిలాల్ అభినందించారు.

# జాతీయ క్రీడా సంస్థల గుర్తింపుతో పాటు పాలన ప్రమాణాలను పర్యవేక్షించనున్న జాతీయ క్రీడా మండలి

న్యూఢిల్లీ, మే 26:జాతీయ క్రీడా పరిపాలన చట్టం-2025 నిబంధనల్లో భాగంగా జాతీయ క్రీడా పరిపాలన (జాతీయ క్రీడా ప్రత్యేక న్యాయస్థానం) నియమాలు-2026తో పాటు జాతీయ క్రీడా పరిపాలన (జాతీయ క్రీడా ప్రత్యేక న్యాయస్థానం) నియమాలు-2026ను కూడా కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసింది.

జాతీయ క్రీడా పరిపాలన (జాతీయ క్రీడా మండలి) నియమాలు-2026లో మండలి కూర్పు, చైర్‌పర్సన్‌తో పాటు సభ్యుల పదవీకాలం, జీతం, భత్యాలు, సేవకు సంబంధించిన ఇతర షరతులు సహా మండలికి ఉండే అధికారాలు, విధులను పొందుపరిచారు.

నియమాల ప్రకారం, జాతీయ క్రీడా మండలి (అన్వేషణ సహా ఎంపిక సంఘం) నియమాలు-2026లో భాగంగా ఏర్పాటు చేసిన అన్వేషణ సహా ఎంపిక సంఘం సిఫార్సు చేసిన పేర్ల ప్యానల్ నుంచి కేంద్ర ప్రభుత్వం నియమించిన చైర్‌పర్సన్, ఇద్దరు సభ్యులతో జాతీయ క్రీడా మండలిని ఏర్పాటు చేస్తారు.

జాతీయ క్రీడా సంస్థలకు గుర్తింపును ఇవ్వడమే కాక పరిపాలన, ఆర్థిక, నైతిక ప్రమాణాలను పాటించేటట్లు నిర్ధారించే కేంద్ర ప్రాధికార సంస్థగా కూడా జాతీయ క్రీడా మండలి పనిచేస్తుంది.

ప్రత్యేక న్యాయస్థానం చైర్‌పర్సన్, సభ్యుల పదవీకాలం, వారి నియామకం, పునర్నియామక ప్రక్రియ, జీత భత్యాలు, సేవకు సంబంధించిన షరతులు, ప్రత్యేక న్యాయస్థానానికి ఉండే అధికారాలను జాతీయ క్రీడా పరిపాలన (జాతీయ క్రీడా ప్రత్యేక న్యాయస్థానం) నియమాలు-2026లో పొందుపరిచారు.

ఈ నియమాల్లో డిజిటల్ మాధ్యమం ద్వారా అమలుకు సంబంధించిన సాంకేతిక, చట్టపరమైన చర్యలను కూడా చేర్చారు. వీటిలో కేంద్ర ప్రభుత్వం ద్వారా వివాదాలు, నోటీసులు, జవాబులు, దస్తావేజులు, వివరణలను సమర్పించడంతో పాటు, ప్రత్యేక న్యాయస్థానం పంపించే కమ్యూనికేషన్, ఆదేశాల ప్రచురణ, దృశ్య మాధ్యమం సహాయంతో విచారణలకు తోడు, రికార్డుల నిర్వహణకే ఉద్దేశించిన ఒక ప్రత్యేక పోర్టల్‌కు సంబంధించిన నోటిఫికేషన్ కూడా ఉంది.

దేశంలో క్రీడలకు సంబంధించిన వివాదాలను పరిష్కరించడానికి ఒక ప్రత్యేక న్యాయ నిర్ణయ సంస్థ (అజుడికేటరీ బాడీ)గా జాతీయ క్రీడా ప్రత్యేక న్యాయస్థానం పనిచేస్తుంది. సివిల్ కోర్టులపై ఆధారపడటాన్ని తగ్గించడం, క్రీడల నిర్వహణ, పరిపాలనలకు సంబంధించిన వివాదాలను స్వతంత్రంగా, శీఘ్రంగా, ప్రభావవంతంగా, తక్కువ ఖర్చులో పరిష్కరించేటట్లు చూడడం దీని లక్ష్యాలు.

అంతకంతకూ పెరుగుతున్న వ్యాజ్యాల సంఖ్యను తగ్గించడం, క్రీడా వివాదాలను త్వరిత గతిన, సరళ రీతిన, అన్ని వర్గాలకు సులభమైన పద్దతిలో పరిష్కరించడానికి ఒక ఏక గవాక్ష యంత్రాంగాన్ని ఈ ప్రత్యేక న్యాయస్థానం అందిస్తుందని భావిస్తున్నారు.

# లంబాడీల ఆత్మగౌరవాన్ని కాపాడింది బీఆర్ఎస్

హైదరాబాద్, మే 26: చిన్న తండాలను కూడా పంచాయతీలుగా మార్చి లంబాడీల ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని మాజీ మంత్రి టి.హరీశ్ రావు పేర్కొన్నారు. కె.చంద్రశేఖర్ రావు నాయకత్వంలో గిరిజనుల అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశామన్నారు.

హైదరాబాద్‌లో లంబాడీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాలో పాల్గొన్న హరీశ్‌రావు మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించా మని గుర్తు చేశారు. బంజారాహిల్స్‌లో బంజారాల కోసం ఆత్మగౌరవ భవనం నిర్మించామని తెలిపారు. టీఎస్ ప్రైడ్ కార్యక్రమం ద్వారా 13,200 మందికి ఉద్యోగాలు కల్పించామని, ఎస్సీ, ఎస్టీ విద్యార్థినుల కోసం ప్రత్యేక డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేశామని చెప్పారు.

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సేవాలాల్, కుమురం భీం, ఏకలవ్య కార్పొరేషన్లకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని హరీశ్‌రావు విమర్శించారు. గిరిజనుల అభివృద్ధి, సంక్షేమంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆరోపించారు.

# 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.1.87 లక్షల కోట్ల చారిత్రక టర్నోవర్‌ను సాధించిన ఖాదీ , గ్రామీణ పరిశ్రమలు




న్యూఢిల్లీ, మే 26:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ దూరదృష్టి నాయకత్వంలో ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ 2025-26 ఆర్థిక సంవత్స రంలో ఉత్పత్తి, అమ్మకాలు , ఉపాధి కల్పన రంగాల్లో కొత్త రికార్డులను సృష్టించింది. గాంధీ దర్శన్, రాజ్‌ఘాట్, న్యూఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో కేవీఐసీ ఛైర్మన్ శ్రీ మనోజ్ కుమార్ విడుదల చేసిన తాత్కాలిక గణాంకాల ప్రకారం, ఖాదీ , గ్రామీణ పరిశ్రమల ఉత్పత్తుల టర్నోవర్ తొలిసారిగా రూ.1.87 లక్షల కోట్ల మార్కును దాటింది.

2013-14 ఆర్థిక సంవత్సరంలో రూ.31,154 కోట్లుగా ఉన్న ఖాదీ , గ్రామీణ పరిశ్రమల ఉత్పత్తుల అమ్మకాలు, 2025-26 నాటికి రూ.1,87, 105 కోట్లకు చేరుకుని 501 శాతం వృద్ధిని నమోదు చేశాయి. ఇదే కాలంలో ఉత్పత్తి రూ.26, 109 కోట్ల నుండి రూ.1,25, 296 కోట్లకు పెరిగి 380 శాతం వృద్ధిని సాధించింది. ఉపాధి కల్పనలో కూడా 56 శాతం వృద్ధి నమోదై, ఉపాధి పొందుతున్న వారి సంఖ్య 1.30 కోట్ల నుండి 2.04 కోట్లకు పెరిగింది.

ఈ విజయాలకు మహాత్మా గాంధీ ఆశయాలు, గ్రామీణ కళాకారుల కృషి , 'ఆత్మనిర్భర్ భారత్', 'వోకల్ ఫర్ లోకల్', 'లోకల్ టు గ్లోబల్' వంటి కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలు ప్రధాన కారణమని మనోజ్ కుమార్ పేర్కొన్నారు. ఖాదీ ఇప్పుడు కేవలం సంప్రదాయ ఉత్పత్తి మాత్రమే కాకుండా, స్వావలం బనతో కూడిన నూతన భారతానికి ప్రతీకగా మారిందన్నారు. గ్రామీ ణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో ఈ రంగం కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు.ఖాదీ వస్త్రాల రంగంలో కూడా గణనీయమైన పురోగతి నమోదైంది. 2013-14లో రూ.811 కోట్లుగా ఉన్న ఖాదీ ఉత్పత్తి, 2025-26 నాటికి రూ.3,974 కోట్లకు చేరుకోగా, అమ్మకాలు రూ.1,081 కోట్ల నుండి రూ.7,869 కోట్లకు పెరిగి 628 శాతం వృద్ధిని సాధించాయి. గ్రామీణ పరిశ్రమల రంగం కూడా ఉత్పత్తి , అమ్మకాలలో విశేష పురోగతి సాధించింది.

ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం (పీఎంఈజీపీ) కింద 2025-26 ఆర్థిక సంవత్సరంలో 66,494 కొత్త యూనిట్లు స్థాపించబడి, 7.31 లక్షల మందికి పైగా ఉపాధి అవకాశాలు కల్పించబడ్డాయి. మహిళా సాధికారతలో భాగంగా, వివిధ శిక్షణా కార్యక్రమాల్లో శిక్షణ పొందిన వారిలో సుమారు 59 శాతం మహిళలే ఉన్నారు.

ఖాదీ కళాకారులకు చెల్లించే పారితోషికం కూడా గణనీయంగా పెరిగింది. 2013-14లో ఒక్క హాంక్‌కు రూ.4గా ఉన్న పారితోషికం ప్రస్తుతం రూ.15కు పెరిగి సుమారు 275 శాతం వృద్ధిని నమోదు చేసింది.

## ఏపీఐఐసీ కాలనీవాసుల రిజిస్ట్రేషన్ సమస్య పరిష్కార దిశగా అడుగులు..

విజయవాడ, మే 26: ఏపీఐఐసీ కాలనీవాసుల దశాబ్దాల నాటి రిజిస్ట్రేషన్ సమస్య పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంటోంది. ఈ సమస్యపై విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని చిన్ని ప్రత్యేక చొరవ చూపారు.

విజయవాడలోని సీఎన్ క్యాంప్ కార్యాలయంలో సీఎస్ సాయి ప్రసాద్ అధ్యక్షతన ఏపీఐఐసీ కాలనీవాసుల రిజిస్ట్రేషన్ సమస్యపై ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంపీ కేశినేని చిన్ని, మంత్రి అనగాని సత్య ప్రసాద్, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ ఏపీఐఐసీ కాలనీ ఆటోనగర్ కార్మికుల కోసం గతంలో నిర్మించిన క్వార్టర్స్‌లో కేవలం ప్లింత్ ఏరియాకే రిజిస్ట్రేషన్ జరిగిందని తెలిపారు. ముందు, వెనుక ఉన్న స్థలాన్ని ఖాళీగా ఉంచడంతో కాలనీవాసులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు.

ఈ రిజిస్ట్రేషన్ సమస్య పరిష్కారమైతే ఈడబ్ల్యూఎస్, ఎంఐజి కుటుంబాలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. గత టీడీపీ హయాంలో ఈ అంశంపై స్పష్టత వచ్చినప్పటికీ, అనంతర ప్రభుత్వ కాలంలో సమస్య పెండింగ్‌లోకి వెళ్లిందని ఆయన అన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎంపీ తెలిపారు.

# దేశాధినేతలకు దౌత్యపరమైన బహుమతుల ద్వారా భారత గిరిజన వారసత్వాన్ని ప్రపంచానికి చాటిన గౌరవ ప్రధాని నరేంద్ర మోదీ



న్యూఢిల్లీ, మే 26:వైవిధ్యభరితమైన దేశీయ కళా సాంస్కృతిక సంప్రదాయాలను ప్రతిబింబించేలా ప్రత్యేకంగా రూపుదిద్దిన బహుమతులను దౌత్య చర్చల సందర్భంగా పలు దేశాధినేతలకు అందించడం ద్వారా... సుసంపన్నమైన భారత వారసత్వ, సంప్రదాయ హస్తకళా వైభవాన్ని గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రపంచానికి చాటారు.

ఉత్తేజకరమైన భారత గిరిజన కళా పరంపరకు చిహ్నంగా నిలిచే మధ్యప్రదేశ్‌కు చెందిన ఒక సాంప్రదాయక గోండు చిత్రపటాన్ని స్వీడన్ యువరాణి విక్టోరియాకు బహూకరించారు. చుక్కలూ - రేఖాకృతులతో, ప్రకాశవంతమైన సహజ రంగులూ - ప్రకృతి ప్రేరిత ఇతివృత్తాల చిత్రణతో గోండు సృజనకారులు తీర్చిదిద్దిన ఈ కళాఖండం అంతర్జాతీయ ఖ్యాతిని పొందింది. మధ్యభారతంలో గిరిజన కళాకారులకు గోండు కళ సుస్థిరమైన జీవనోపాధి అవకాశాలను అందిస్తోంది.

అస్సాం సాంప్రదాయక 'ముగా' పట్టు దుపట్టాతోపాటు మణిపూర్‌లోని తంగ్‌ఖుల్ నాగా కళాకారులు అత్యంత నైపుణ్యంతో రూపొందించిన శిరుయ్ లిల్లీ స్టోల్‌ను ఇటలీ ప్రధానమంత్రి జార్జియా మెలోనికి బహూకరించారు. ప్రత్యేకమైన సహజ సిద్ధమైన బంగారు జిలుగులు, మన్నికకు ముగా పట్టు పేరుగాంచింది. శతాబ్దాల నాటి అస్సాం చేనేత సంప్రదాయానికి అది ప్రతీక. భౌగోళిక గుర్తింపును కూడా పొందింది. ఇక శిరుయ్ లిల్లీ స్టోల్.. తంగ్‌ఖుల్ నాగా గిరిజనుల సాంస్కృతిక అస్తిత్వాన్ని, కళా సంప్రదాయాలను ప్రతిబింబిస్తుంది. మణిపూర్‌కు చెందిన అరుదైన రాష్ట్ర పుష్పం శిరుయ్ లిల్లీ దీనికి ప్రేరణ.

మణిపూర్ నల్ల బియ్యాన్ని (చాక్-హావ్) గౌరవ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రాజమాతకు బహూకరించారు. ఆ ప్రాంతంలోని కొండజాతి గిరిజన సామాజిక వర్గాలు తరతరాలుగా సంప్రదాయబద్ధంగా పండిస్తున్న విశేషమైన ధాన్యమిది. అద్భుతమైన పౌష్టిక, ఔషధ విలువలతో అంతర్జాతీయ గుర్తింపును పొందిన ఈ చాక్-హావ్ బియ్యం.. అక్కడి దేశీయ తెగలు తరతరాలుగా కాపాడుకుంటూ వస్తున్న సుసంపన్నమైన వ్యవసాయ సంప్రదాయాలకు నిదర్శనం.దేశ గిరిజన సంప్రదాయాలను, దేశీయ హస్తకళలను, సాంస్కృతిక వారసత్వాన్ని ఈ దౌత్య కార్యక్రమాల ద్వారా గౌరవ ప్రధానమంత్రి అంతర్జాతీయ వేదికపై ఘనంగా చాటారు. దేశ కళా, సాంస్కృతిక వైవిధ్యాన్ని కాపాడడంలో గిరిజన సమాజం అందిస్తున్న అమూల్యమైన సేవలకు లభించిన సముచితమైన గుర్తింపు, గౌరవమిది.

# భారత్-జపాన్ సెమినార్‌తో శ్రామిక శక్తి సహకారంలో నూతనోత్తేజం

న్యూఢిల్లీ, మే 26:భారత్-జపాన్ దేశాల మధ్య శ్రామిక శక్తి సహకారంపై మే 25న టోక్యోలో సంయుక్త సెమినార్ జరిగింది. జపాన్‌లోని భారత రాయబార కార్యాలయం, ఆసియాన్ వన్ కో లిమిటెడ్ సం యుక్తంగా ఈ సెమినార్‌ను నిర్వ హించాయి. ఈ కార్యక్రమానికి భారత ప్రభుత్వ కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీమతి వందన గుర్నాని ముఖ్య అతిథిగా హాజరై, కీలక ప్రసంగం ఇచ్చారు.

భారత్, జపాన్ దేశాల మధ్య నైపుణ్యం గల కార్మిక శక్తి మార్పిడి, మానవ వనరుల అభివృద్ధిలో దీర్ఘకాలిక సహకారంపై చర్చించేందుకు జపాన్ విధాన రూపకర్తలు, పరిశ్రమల ప్రముఖులు, విద్యా సంస్థలు, శ్రామిక శక్తి రవాణా భాగస్వాములు ఈ సెమినార్‌లో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమానికి భారత్, జపాన్ దేశాల ప్రముఖ ప్రతినిధులు హాజరయ్యారు. జపాన్ ప్రతినిధుల సభ సభ్యులైన న్యాయశాఖ మాజీమంత్రి మిస్టర్ యమషిత, ఆర్థిక, వాణిజ్య, పరిశ్రమల శాఖల మంత్రి మిస్టర్ ఇనో, విద్య, సంస్కృతి, క్రీడలు, సైన్స్, టెక్నాలజీ శాఖల మంత్రి మిస్టర్ నకమురా, జపాన్ బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ కోఆపరేషన్ చైర్మన్ మిస్టర్ తదాషి మేదా, జపాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ మిస్టర్ కెంగో ఒట్సుకా, జపాన్‌లోని భారత రాయబారి శ్రీమతి నగ్మా మహ్మద్ మల్లిక్ ఈ సెమినార్‌లో పాల్గొన్నారు.

భారత కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ కార్యదర్శి ప్రసంగిస్తూ.. విశ్వసనీయ అంతర్జాతీయ కార్మిక భాగస్వామిగా భారత్ ఎదుగుతున్న తీరును ప్రముఖంగా ప్రస్తావిం చారు. పారదర్శక, నైతిక, విస్త రించదగిన అంతర్జాతీయ శ్రామి క శక్తి బదిలీ మార్గాలను ఏర్పరి ంచేందుకు భారత ప్రభుత్వ నిబద్ధతను ఆమె స్పష్టం చేశారు. భార తదేశ జనాభా బలం, బలమైన నైపుణ్య వ్యవస్థ, సంస్థాగత సంస్కరణలు.. జపాన్‌తో సహా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలకు నైపు ణ్యం గల మానవ వనరులను అందించే విశ్వసనీయ దేశంగా భారత్‌ను నిలబెడుతున్నాయని స్పష్టం చేశారు.

ఉన్నత విద్యా సంస్థలు, పారిశ్రామిక శిక్షణా సంస్థలు, అప్రెంటిస్‌షిప్ విధానాలు, డిజిటల్ నైపుణ్య వేదికలు, ఉపాధి సేవల మద్దతుతో భారత్‌లో భారీ స్థాయిలో రూపుదిద్దుకున్న వర్క్‌ఫోర్స్ ప్రిపరేషన్ ఎకోసిస్టమ్ గురించి ఆమె వివరించారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఇ-మైగ్రేట్ వేదిక, నేషనల్ కెరీర్ సర్వీస్ వేదిక, మోడల్ కెరీర్ సెంటర్లు, నైపుణ్యాభివృద్ధి-కార్మిక పారిశ్రామిక మంత్రిత్వ శాఖ, రాష్ట్రాలు, విద్యా సంస్థలతో విస్తృతమైన నైపుణ్య వ్యవస్థతో సహా భారతదేశ అంతర్జాతీయ కార్మిక వలసల వ్యవస్థ గురించి ఆమె ప్రస్తావించారు.

భారత్, జపాన్ దేశాల మధ్య జపనీస్ భాషా నైపుణ్యాన్ని పెంపొందించటం, నిర్దిష్ట రంగానికి సంబంధించిన నైపుణ్యాల శిక్షణ, పరీక్షల మౌలిక సదుపాయాలు, నైపుణ్యాల మ్యాపింగ్, వృత్తిపరమైన యోగ్యత, క్రమబద్ధమైన డిమాండ్ సమీకరణ, నైతిక నియామక పద్ధతులు, సంస్థాగత సహకారాన్ని బలోపేతం చేయాల్సిన అవసరముందని కార్యదర్శి స్పష్టం చేశారు.

జపాన్ ప్రధానమంత్రి, గౌరవ అస్సాం ముఖ్యమంత్రి డాక్టర్ హిమంత బిస్వా శర్మ, గౌహతి ఐఐటీ డైరెక్టర్ల నుంచి ప్రత్యేక సందేశాలు అందాయి. ఈ సందేశాల్లో భారత్-జపాన్ మధ్య మధ్యకాలిక, దీర్ఘకాలిక మానవ వనరుల మార్పిడికి సంబంధించి స్పష్టమైన భవిష్యత్ ప్రణాళికను వివరించారు. అంతర్జాతీయ అవసరాలకు అనుగుణంగా, ప్రపంచ స్థాయి నైపుణ్యాలు గల శ్రామికులను తయారు చేయటంలో భారతదేశంలోని రాష్ట్రాలు, ఉన్నత విద్యా సంస్థలు పోషిస్తున్న కీలక పాత్రను ప్రముఖంగా ప్రస్తావించారు.

భారత్‌లోని నైపుణ్యం గల శ్రామిక వ్యవస్థతో క్రమబద్ధమైన భాగస్వామ్యాన్ని అన్వేషిస్తున్న ప్రముఖ జపనీస్ కంపెనీల సీనియర్ అధికారులు, మానవ వనరుల విభాగ మేనేజర్లతో సహా దాదాపు 250 మంది ప్రతినిధులు ఈ సెమినార్‌లో పాల్గొన్నారు.

తయారీ, సంరక్షణ సేవలు, నిర్మాణం, ఆటోమొబైల్ నిర్వహణ, ఆతిథ్య రంగం, వ్యవసాయం, ఐటీ, డిజిటల్ సేవలు, నూతనంగా అభివృద్ధి చెందుతున్న గ్రీన్ ఎకానమీ వంటి రంగాల్లో భారత్-జపాన్ మధ్య సహకారానికి బలమైన అవకాశాలున్నాయని ప్రతినిధులు గుర్తించారు. పారదర్శకమైన, విస్తృతమైన ఉపాధి అవకాశాలను పెంపొందించటంలో డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయాలు, ఉపాధి కల్పన వ్యవస్థల ప్రాధాన్యతను ఈ చర్చలు స్పష్టం చేశాయి.

భవిష్యత్ కార్యాచరణలో భాగంగా భారతదేశంలో జపనీస్ భాషా శిక్షణ, పరీక్షా కేంద్రాల విస్తరణ.. జపనీస్ యజమానులు, భారత నైపుణ్య శిక్షణా సంస్థల మధ్య సహకారాన్ని బలోపేతం చేయటం, జపాన్‌లోని ఉపాధి డిమాండ్‌ను స్పష్టంగా గుర్తించటం, నైపుణ్యాల గుర్తింపు, వృత్తిపరమైన యోగ్యతను పెంపొందించటం, సన్నిహిత సంస్థాగత సహకారం ద్వారా విశ్వసనీయమైన శ్రామిక శక్తి బదిలీ మార్గాలను ఏర్పాటు చేయటం వంటి అంశాలపై ఇరుపక్షాలు చర్చించాయి.

ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగ అవకాశాలకు ముఖ్యంగా జపాన్ వెళ్లే అభ్యర్థులను సిద్ధం చేయటానికి అస్సాం ప్రభుత్వం చేపట్టిన ఫారిన్ లాంగ్వేజ్ ఇనిషియేటివ్ ఫర్ గ్లోబల్ టాలెంట్ (ఫ్లైట్).. అద్భుతమైన రాష్ట్ర స?థాయి కార్యక్రమంగా నిలిచింది.

ఆసియాన్ గ్రూప్ కో. లిమిటెడ్ చైర్మన్, సీఈఓ మిస్టర్ తోషియాకి నిషికావా ఉపన్యాసంతో ఈ కార్యక్రమం ముగిసింది. భారత్-జపాన్ ప్రజల మధ్య దీర్ఘకాలిక భాగస్వామ్య ప్రాముఖ్యతను ఆయన స్పష్టం చేశారు. భవిష్యత్తులో శ్రామిక శక్తి సహకారంపై ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే పదేళ్లలో 50,000 మందితో జపాన్-భారత్ పర్సనల్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంను సాకారం చేయటం పట్ల ఆయన ఆసక్తిని కనబరిచారు.

# పౌరులకు ఇంటర్నెట్‌ను మరింత సులభంగా, అందుబాటులోకి తీసుకొచ్చేందుకు పీఎం వాణీ వైఫై సేవల్లో కీలక మార్పులు చేపట్టిన కేంద్రం

న్యూఢిల్లీ, మే 26:దేశంలో డిజిటల్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి, ప్రజలకు ఇంటర్నెట్ వాడకాన్ని మరింత సులభతరం చేసే దిశగా కేంద్ర టెలికమ్యూనికేషన్ల శాఖ, 'పీఎం-వాణి' (ప్రధానమంత్రి వైఫై యాక్సెస్ నెట్‌వర్క్ ఇంటర్‌ఫేస్) వ్యవస్థ ద్వారా వినియోగ దారులకు ఉపయోగపడేలా పలు కీలకమైన మార్పులను ప్రవేశపెట్టింది.

ఈ సంస్కరణలను 22 మే 2026 నాటి సర్క్యులర్ నంబర్లు 1/పీఎం-వాణి/2026, 2/పీఎం-వాణి/2026 ద్వారా టెలికమ్యూనికేషన్ల శాఖ ప్రవేశపెట్టింది.

పీఎం వాణి వ్యవస్థతో ముడిపడి ఉన్న భాగస్వాములందరూ ఈ నవరించిన మార్గదర్శకాలను, సర్క్యులర్ జారీ చేసిన తేదీ నుంచి ఎనిమిది వారాల లోపు అమలు చేయాలని ఆదేశించారు. దీనివల్ల 2026 జులై నాటికి ఈ కొత్త సులభతరమైన ఫీచర్లు దేశవ్యాప్తంగా అందుబాటులోకి రానున్నాయి.

ప్రతి పౌరుడికి సులభంగా, తక్కువ ధరలోనే డిజిటల్ అనుసంధానాన్ని అందించాలనే ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికతను సాకారం చేయడానికి ప్రభుత్వం నిరంతరాయంగా చేస్తున్న ప్రయత్నాల్లో ఈ సంస్కరణలు ఒక భాగం.

కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ, ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య సింధియా నాయకత్వంలో ఇంటర్నెట్ అందరికీ సులభంగా లభించడం, పరస్పర అనుసంధానం, వినియోగ సౌలభ్యం, ప్రజలు దీనిని ఎక్కువగా ఉపయోగించేలా చేయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ పీఎం-వాణి వైఫై వ్యవస్థ ఒక సమగ్ర మార్పునకు లోనవుతోంది.

ఈ మార్పుల అమలును వేగవంతం చేయడానికి, వినియోగదారుల అనుభవాన్ని మెరుగుపరచడానికి కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసాని ఇటీవల శాఖాధికారులు, భాగస్వాములతో విస్తృత స్థాయి సమీక్షా సమావేశాలు నిర్వహించారు.

ఈ సంస్కరణల గురించి డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ.. "ప్రజలందరికీ పబ్లిక్ వైఫై సేవలను అందించడానికి పీఎం వాణి మనకున్న ఒక అద్భుతమైన వేదిక. ఇప్పుడు దీని వాడకాన్ని మరింత సులభం చేస్తున్నాం. క్యూఆర్ ఆధారిత లాగిన్ ద్వారా మీ ఫోన్‌తో కేవలం ఒక కోడ్‌ను స్కాన్ చేసి, మీ ల్యాప్‌టాప్‌ను సులువుగా కనెక్ట్ చేసుకోవచ్చు. కొద్దిసేపు మాత్రమే ఇంటర్నెట్ అవసరమయ్యే వినియోగదారుల కోసం 15, 30, 60 నిమిషాల చిన్న ప్లాన్లను అందుబాటులోకి తేవాలని హాట్‌స్పాట్ ఆపరేటర్లకు సూచించాం" అని తెలిపారు.

నేటి డిజిటల్ యుగంలో దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు, ప్రయాణికులు, రోజువారీ ప్రయాణం చేసేవారు, ఉద్యోగులు, చిన్న వ్యాపారాలకు మద్దతుగా నిలుస్తూ... పబ్లిక్ వైఫై ఒక ముఖ్యమైన ప్రజా వినియోగ సేవగా అవతరిస్తోందని ఆయన పేర్కొన్నారు.

క్యూఆర్ గుర్తింపు ద్వారా సులభంగా ల్యాప్‌టాప్ లాగిన్

పీఎం వాణి సేవలను సులభంగా వినియోగించుకునేందుకు వీలుగా ల్యాప్‌టాప్‌లు వంటి ఇతర అదనపు పరికరాల కోసం క్యూఆర్ ఆధారిత లాగిన్ పద్ధతిని టెలికమ్యూనికేషన్ల శాఖ ప్రస్తుతం అనుమతిస్తోంది. లాగిన్ పేజీలో ఉండే క్యూఆర్ కోడ్‌ను, ముందే వెరిఫై చేసిన స్మార్ట్‌ఫోన్ యాప్ ద్వారా స్కాన్ చేసి వినియోగదారులు ఇంటర్నెట్ కనెక్ట్ చేసుకోవచ్చు. ఇది ఎలాంటి ఇబ్బంది లేకుండా వేగవంతమైన, సురక్షితమైన అనుభవాన్ని అందిస్తుంది.

సౌకర్యవంతమైన స్వల్పకాలిక ప్లాన్లు

రవాణా కేంద్రాలు, మాల్స్ వంటి బహిరంగ ప్రాంతాలలో ఉండే వినియోగదారులకు న వ శ య ం వ డ టా ని కి టెలికమ్యూనికేషన్ల శాఖ ఆపరేటర్లకు ఒక సూచన చేసింది. చిన్న ప్యాకెట్ల రూపంలో ఉండే 15, 30, 60 నిమిషాల కాలపరిమితో కూడిన ప్లాన్లను అందించాలని కోరింది.

ఈ ప్లాన్లు ప్రయాణికులకు, విద్యార్థులకు ఇంటర్నెట్ ఖర్చును బాగా తగ్గిస్తాయి. అదే సమయంలో వైఫై ఆపరేటర్ల ఆదాయాన్ని, హాట్‌స్పాట్‌ల వినియోగాన్ని పెంచుతాయి.

వినియోగదారులు అసలైన, నమ్మకమైన నెట్‌వర్క్‌లను సులభంగా గుర్తించడానికి వీలుగా వైఫై పేర్ల విధానాన్ని పీఎం వాణీ బ్రాండింగ్‌తో ప్రామాణీకరించారు. అంటే అన్నింటికీ ఒకే తరహా పేరు వచ్చేలా చేశారు.

డిజిటల్ ఇండియా కార్యక్రమం ద్వారా ప్రారంభించిన పీఎం వాణి వ్యవస్థ... పీడీఓలు, పీడీఓఏలు, యాప్ ప్రొవైడర్ల భాగస్వామ్యంతో దేశవ్యాప్తంగా విస్తరించదగిన, తక్కువ ధరకే ఇంటర్నెట్‌ను అందిస్తోంది. దేశవ్యాప్తంగా పబ్లిక్ వైఫై మౌలిక సదుపాయాల వాడకాన్ని మరింతగా పెంచడమే ఈ సంస్కరణల ముఖ్య ఉద్దేశం.

## మహిళలు వ్యాపార రంగంలో రాణించాలి : మున్సిపల్ చైర్ పర్సన్ పుల్కం రాజు



రాజన్న సిరిసిల్ల, మే 26: (నేటినిజం ప్రతినిధి): మహిళలు వ్యాపార రంగంలో రాణించాలని వేములవాడ మున్సిపల్ చైర్ పర్సన్ పుల్కం రాజు అన్నారు. మంగళవారం ఇంద్ర మహిళా శక్తి క్యాంటీన్ ప్రభుత్వ విప్ శ్రీనివాస్ ప్రారంభించారు.?క్యాంటీన్ ప్రారంభోత్సవం అనంతరం వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు క్యాంటిన్ ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన క్యాంటీన్‌లో స్వయంగా భోజనాన్ని స్వీకరించి, రుచిని మరియు నాణ్యతను పరిశీలించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ.. వేములవాడ ప్రభుత్వాసుపత్రికి వివిధ ప్రాంతాల నుండి వచ్చే పేద రోగులతో పాటు, వారి సహాయకులకు, అలాగే దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దర్శనార్థం వచ్చే భక్తులకు ఈ క్యాంటీన్ ద్వారా ఎంతో మేలు జరుగుతుందని కొనియాడారు. చాలా తక్కువ ఖర్చుతోనే అందరికీ నాణ్యమైన, రుచికరమైన, పరిశుభ్రమైన ఆహారం ఇక్కడ అందుబాటులోకి రావడం సంతోషకరమన్నారు. దీనివల్ల ఒకవైపు ప్రజలకు తక్కువ ధరకే భోజన వసతి దొరకడమే కాకుండా, మరోవైపు స్థానిక మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు చక్కటి ఉపాధి లభించి వారు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి తోడ్పడుతుందని ఆయన పేర్కొన్నారు. మహిళా సంఘాల సభ్యులు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ క్యాంటీన్‌ను విజయవంతంగా నిర్వహించాలని కోరారు. ? రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం ముందుకు వెళుతుందని చైర్మన్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్‌తో పాటు స్థానిక వార్డుల కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, మెప్మా అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## యువత పొగాకు మాయాజాలానికి దూరంగా ఉండాలి..

కర్నూలు, మే 26: దేశ భవిష్యత్తైన యువత పొగాకు కంపెనీలు చేస్తున్న ప్రచార మాయాజాలానికి లోనుకాకుండా అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, కర్నూల్ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ కె. చిట్టి నరసమ్మ పిలుపునిచ్చారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం (మే 31)ను పురస్కరించుకుని మంగళవారం స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్‌లో కమ్యూనిటీ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

ప్రస్తుతం పొగాకు వినియోగం కేవలం సిగరెట్లకే పరిమితం కాలేదని, గుట్కా, పాన్ మసాలా, హుక్కా, నషమ్ వంటి రూపాల్లో యువత వ్యసనాలకు లోనవుతోందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఇవి క్యాన్సర్‌తో పాటు గుండెపోటు, పక్షవాతం, శ్వాసకోశ సమస్యలు, వంధ్యత్వం వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు కారణమవుతాయని హెచ్చరించారు. స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ సి.ఎస్.కే. ప్రకాష్ మాట్లాడుతూ క్యాన్సర్‌పై ప్రజల్లో సరైన అవగాహన అవసరమని అన్నారు. పొగాకు వినియోగం వల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్ మాత్రమే కాకుండా నోటి క్యాన్సర్, అన్నవాహిక క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్, పెద్దప్రేగు క్యాన్సర్, లివర్ క్యాన్సర్ వంటి అనేక రకాల క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఉందని వివరించారు.

వైస్ ప్రిన్సిపల్, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ సింధియా శుభప్రద మాట్లాడుతూ యువత దేశ నిర్మాణంలో కీలక శక్తిగా ఉండాలని, పొగాకు వ్యసనాలకు బానిస కావడం సమాజానికి ప్రమాదకర సంకేత మని పేర్కొన్నారు. వ్యసనాల నుంచి బయటపడేందుకు ప్రభుత్వం డి-అడిక్షన్ సెంటర్లను ఏర్పాటు చేసిందని, అవసరమైన వారు వీటిని వినియోగించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమానికి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రవి నాయక్ నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరించారు.

## ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించిన ప్రభుత్వ విప్, శాసనసభ్యులు ఆది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల, మే 26: (నేటినిజం ప్రతినిధి): వేములవాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ముందు ఏర్పాటు చేసిన మెప్మా క్యాంటీన్, క్యాటరింగ్ కేంద్రాన్ని రాజరాజేశ్వరి దేవి మహిళా స్వశక్తి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరైన క్యాంటీన్‌ను ప్రార ంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఇలాంటి క్యాంటీన్ల ఏర్పాటుకు పెద్ద పీట వేస్తోందని, మహిళా సంఘాల సభ్యులుఈ



అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వ్యాపారరంగంలో విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు

# తెలుగు సాహిత్య నందనవనంలో దీపాల కాంతి: పిచ్చయ్య శాస్త్రి

**మే 27... పిచ్చయ్య శాస్త్రి జయంతి**



తెలుగు సాహిత్య ఆకాశంలో సంప్రదాయ పాండిత్య ప్రభలను, ఆధునిక చైతన్య కిరణాలను సమన్వయపరిచి నూతన కాంతులను విరజిమ్మిన మహనీయులలో శ్రీ దీపాల పిచ్చయ్య శాస్త్రి అగ్రగణ్యులు. సంస్కృతాంధ్ర భాషలపై సమానమైన అసాధారణ పట్టు సాధించిన ఆయన, కేవలం ఒక కవిగానే కాక, ఉత్తమ వ్యాకరణకర్తగా, అలంకార శాస్త్ర నిష్ణాతుడిగా, అనువాదకుడిగా, అద్భుత ఉపన్యాసకుడిగా మరియు పత్రికా రచయితగా బహుముఖ ప్రజ్ఞను చాటుకున్నారు. పంతొమ్మిదో శతాబ్దపు చివరలో, అనగా 1894వ సంవత్సరంలో మే 27న గుంటూరు జిల్లా రొంపిచర్ల పరిధిలోని బొమ్మరాజుపల్లి గ్రామంలో ఒక సాంప్రదాయ వేద పండిత కుటుంబంలో జన్మించిన పిచ్చయ్య శాస్త్రి గారికి బాల్యం నుంచే భాషా సంస్కారాలు ఇంటి వాతావరణం ద్వారానే అబ్బాయి. ఆనాటి గురుకుల విద్యా పద్ధతిలో కావ్య, నాటక, అలంకార శాస్త్రాలను క్షుణ్ణంగా అభ్యసించిన ఆయన, మద్రాసు విశ్వవిద్యాలయం నిర్వహించిన విద్వాన్ వంటి ఉన్నత పరీక్షలలో అత్యంత ప్రతిభావంతంగా ఉత్తీర్ణులయ్యారు. అనంతరం అక్షర నిలయమైన నెల్లూరు నగరానికి చేరుకుని, అక్కడి ప్రసిద్ధ విద్యాసంస్థ అయిన వెంకటగిరి మహారాజా కళాశాలలో పందొమ్మిది సంవత్సరాల పాటు సుదీర్ఘంగా ప్రధానాంధ్ర పండితులుగా సేవలు అందించారు. ఈ సుదీర్ఘ బోధనా కాలం అనేక తరాల విద్యార్థులను మహోన్నత పండితులుగా, కవులుగా తీర్చిదిద్దడానికి అద్భుతమైన వేదికగా నిలిచింది. బాల్యంలోనే అమరకోశం, రఘువంశం, కుమారసంభవం వంటి సంస్కృత కావ్యాలను, నన్నయ, తిక్కన, ఎర్రనల ఆంధ్ర మహాభారతాన్ని, శ్రీనాథుని నైషధాది కావ్యాలను జీర్ణించుకున్న ఆయనకు, తెలుగు సాహిత్య రంగంలో ఆనాటి నవయుగ వైతాళికులు, శతావధాన ప్రక్రియకు అత్యంత వన్నె తెచ్చిన జంటకవులు అయిన తిరుపతి వెంకట కవులు కవితా గురువులుగా లభించడం ఒక గొప్ప చారిత్రక విశేషం. ఈ గురుశిష్య సంబంధం పిచ్చయ్య శాస్త్రి లోని కవితా సృజనాత్మకతకు, విమర్శనాత్మక దృక్పథానికి పదును పెట్టింది.

ఆయన కవితా ప్రస్థానంలో వెలువడిన పద్య రచనలు తెలుగు సాహిత్య భాండాగారాన్ని సుసంపన్నం చేశాయి. భక్తి తత్వాన్ని, తాత్విక చింతనను మేళవించి ఆయన రాసిన 'భక్త కల్పద్రుమము' భక్తుల హృదయాలను అలరింపజేస్తే, సమాజంలోని సమకాలీన పరిస్థితులను ప్రతిబింబిస్తూ రాసిన 'కాలము' అనే శతకం ఆయన సామాజిక స్పృహకు నిదర్శనంగా నిలిచింది. ఈ శతకంలో కాల మహిమను, మారుతున్న దేశ స్థితిగతులను, నైతిక విలువల పతనాన్ని పద్య రూపంలో ఎంతో ప్రతీకాత్మకంగా, హృదయ విదారకంగా విశ్లేషించారు. సమాజ శ్రేయస్సు కోరే రచయిత కాల ప్రవాహాన్ని ఎలా అర్థం చేసుకోవాలో ఈ రచన నిరూపిస్తుంది. వీటితో పాటు 'భారతి', 'సువర్ణ మేఖల', 'గాలివాన', 'ప్రణయ కుసుమము' వంటి పద్య కావ్యాలు ఆయన సృజనాత్మక వైవిధ్యానికి అద్దం పడతాయి. ప్రకృతి సృష్టిని, మానవ భావోద్వేగాలను గ్రాంథిక శైలిలో ఉంటూనే సరళంగా వ్యక్తపరచడం ఆయన ప్రత్యేకత. అదేవిధంగా, తెలుగు సాహిత్యంలో విస్మృతికి గురవుతున్న అమూల్యమైన విడి పద్యాలను సేకరించి, వాటి పూర్వాపరాలను, చారిత్రక నేపథ్యాలను విశ్లేషిస్తూ ఆయన కూర్చిన 'చాటు పద్య రత్నాకరము' ఒక పరిశోధనాత్మక నిధిగా నిలిచిపోయింది. చాటు పద్యాల వెనుక ఉన్న కవుల ఆశుకవిత్వ పటిమను, సమకాలీన రాజుల పోషణను, ఆనాటి సామాజిక జీవనాన్ని అర్థం చేసుకోవడానికి ఈ గ్రంథం నేటికీ ఒక పరమ ప్రమాణంగా ఉపయోగ పడుతోంది.

తెలుగు సాహిత్యంపై సంస్కృత ప్రభావం ఎంతటి ప్రాధాన్యమైనదో, భాషా వికాసానికి ఆ మూలాలు ఎంత అవసరమో పిచ్చయ్య శాస్త్రి గారు బాగా అవగాహన చేసుకున్నారు. అందువల్లనే సంస్కృతంలోని అత్యున్నత రసవత్తర కావ్యాలను తెలుగులోకి పరిచయం చేయడంలో ఆయన ప్రత్యేకమైన శ్రద్ధ వహించారు. అనువాదం అనేది కేవలం ఒక భాషలోని పదాలను మరొక భాషలోకి మార్చడం మాత్రమే కాదని, మూల గ్రంథంలోని భావాన్ని, సాంస్కృతిక వైభవాన్ని, శైలీ విన్యాసాన్ని ఏమాత్రం దెబ్బతీయకుండా మాతృభాషలోకి ప్రవహింప జేయడమే నిజమైన అనువాద లక్షణమని ఆయన బలంగా నమ్మారు. ఈ నమ్మకానికి నిలువెత్తు సాక్ష్యాలుగా ఆయన చేసిన 'మేఘదూతం', 'రఘువంశం', 'దశకుమార చరిత్ర' అనువాదాలు నిలుస్తాయి. కాళిదాసు మహాకవి రాసిన 'మేఘదూతం'లోని విరహ వేదనను, 'రఘువంశం'లోని రాజ వంశీయుల గాంభీర్యాన్ని తెలుగు పద్యాలలోకి మలిచినప్పుడు మూలంలోని రసాత్మకత చెడకుండా, తెలుగు భాషకే ప్రత్యేకమైన లాలిత్యం మరియు మాధుర్యం సమపాళ్లలో కుదిరేలా జాగ్రత్తపడ్డారు. దండి రాసిన క్లిష్టమైన 'దశకుమార చరిత్ర' వచన కావ్యాన్ని తెలుగు వారికి సులభగ్రాహ్యంగా అందించడంలో ఆయన చూపిన పద సంపద, వాక్య నిర్మాణ చాతుర్యం అసాధారణమైనవి. అందువల్లనే ఆయన అనువాదాలలో మూలగ్రంథ సౌందర్యం, తెలుగు భాషా స్వరూపం పరస్పరం పోటీ పడుతున్నట్లు కనిపిస్తాయి.

పిచ్చయ్య శాస్త్రి గారి ప్రతిభ కేవలం లేఖినికే పరిమితం కాలేదు, ఆయన వాగ్ధాటి ఆనాటి సాహిత్య సభలలో ఒక ప్రభంజనం సృష్టించింది. ఇరవయ్యో శతాబ్దపు తొలి సగంలో అవధానాలు, పండిత పరిషత్తులు, సాహిత్య గోష్ఠులు తెలుగు సాంస్కృతిక జీవనంలో అత్యంత ప్రధాన భూమిక పోషించేవి. అటువంటి వేదికలపై పిచ్చయ్య శాస్త్రి గారు ఉపన్యసిస్తుంటే శ్రోతలు మంత్రముగ్ధులై వినేవారు. ఎంతటి కఠినమైన వ్యాకరణాంశాన్ని అయినా, క్లిష్టమైన అలంకార శాస్త్ర సూత్రాన్ని అయినా పామరులకు సైతం అర్థమయ్యేలా సరళమైన లోకోక్తులతో, నిత్యజీవిత ఉదాహరణలతో వివరించడం ఆయన ప్రత్యేకత. విద్యార్థులు, అధ్యాపకులు, ప్రసిద్ధ పండితులు సైతం ఆయన ఉపన్యాసాల ద్వారా నూతన సాహిత్య విషయాలను గ్రహించేవారు. ఆయన రచనల్లో భాషా శుద్ధి, శైలీ గాంభీర్యం ప్రధాన లక్షణాలుగా గోచరిస్తాయి. తెలుగు భాషలో సంస్కృత పదాల వినియోగాన్ని సముచితంగా మేళవించడంలో ఆయనకు ప్రత్యేక నైపుణ్యం ఉండేది. అదే సమయంలో సాధారణ పాఠకుడు అర్థం చేసుకునే సరళతను కూడా ఆయన కోల్పోలేదు. ఈ కారణంగానే ఆయన రచనలు పాండిత్య వర్గాలకే కాక సామాన్య పాఠకులకు కూడా చేరువయ్యాయి.

భాషా పరంగా సమాజంలో వస్తున్న మార్పులను, ముఖ్యంగా ఆంగ్ల విద్యా ప్రభావం వల్ల మాతృభాషకు జరుగుతున్న అన్యాయాన్ని పిచ్చయ్య శాస్త్రి ముందుగానే పసిగట్టారు. ఆయన కేవలం సాహిత్య సృష్టికే పరిమితం కాకుండా, ఒక నిబద్ధత గల భాషా సంరక్షకుడిగా నిలిచారు.

ఆంగ్ల పదాల వ్యామోహంలో పడి సొంత భాషలోని పదసంపదను మరచిపోవద్దని ఆయన హెచ్చరించారు. మాతృభాషలోనే ప్రాథమిక మరియు ఉన్నత విద్యాబోధన సాగాలని, అప్పుడే విద్యార్థులలో సృజనాత్మకత, ఆలోచనా శక్తి పెరుగుతాయని బలంగా విశ్వసించారు. తెలుగులో శాస్త్రీయ, సాంకేతిక రచనలు రావాలని, అప్పుడే భాషకు ఆధునిక జగత్తులో మనుగడ సాధ్యమవుతుందని ఆనాడే సూచించారు. భాషను ప్రజల జీవన విధానంతో, వారి ఆచార వ్యవహారాలతో అనుసంధానించినప్పుడే అది జీవద్భాషగా వర్ధిల్లుతుందని చాటి చెప్పారు. వ్యాకరణాన్ని కఠిన నియమాల సమాహారంగా కాకుండా భాషా సౌందర్యానికి ఆధారంగా ఆయన చూశారు. అందుకే వ్యాకరణ బోధనలో ఆయన వినూత్న విధానాలను అనుసరించారు. విద్యార్థుల్లో భాషపై ప్రేమ పెంపొందించడమే అసలు బోధన లక్ష్యమని ఆయన భావించేవారు.

సాహిత్య విమర్శ రంగంలో దీపాల పిచ్చయ్య శాస్త్రి స్థానం అద్వితీయమైనది. కవిత్వాన్ని విశ్లేషించేటప్పుడు ఆయన భావపరమైన లోతు, శైలీ వైశిష్ట్యం, అలంకార వినియోగం, ఛందస్సు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించేవారు. విమర్శ అంటే కేవలం తప్పులెత్తిచూపడం కాదని, రచనలోని అంతర్గత సౌందర్యాన్ని వెలికితీయడం అని ఆయన నమ్మకం. అందువల్ల ఆయన విమర్శా రచనల్లో సమతుల్యత కనిపిస్తుంది. ఆయన కాలంలో తెలుగు సాహిత్యం ఒక మార్పు దశలో ఉండేది. సంప్రదాయ సాహిత్యం నుంచి ఆధునిక సాహిత్యానికి మార్పు జరుగుతున్న సమయంలో పిచ్చయ్య శాస్త్రి సంప్రదాయం మరియు ఆధునికత మధ్య వారధిగా నిలిచారు. పూర్వ సాహిత్య విలువలను కాపాడుతూనే కొత్త భావాలను స్వాగతించారు. ఈ సమన్వయ దృక్పథమే ఆయనను ఇతర పండితుల నుంచి ప్రత్యేకంగా నిలబెట్టింది. సంస్కృతాంధ్ర పాండిత్య సంప్రదాయంలో ఆయన చేసిన విశిష్ట సేవలను గుర్తించి, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ 1969వ సంవత్సరంలో ఆయనకు అత్యున్నతమైన 'విశిష్ట సభ్యత్వాన్ని' (ఫెలోషిప్) ఇచ్చి ఘనంగా గౌరవించింది. ఎన్నో పండిత పరిషత్తులు ఆయనను ఆహ్వానించి సన్మానించాయి. శాస్త్రీయ దృష్టితో కూడిన ఆయన రచనలు విశ్వవిద్యాలయ స్థాయిలో కూడా ప్రాముఖ్యత పొందాయి. అనేక పరిశోధకులు ఆయన రచనలను ఆధారంగా తీసుకొని తెలుగు భాషా సాహిత్య అధ్యయనాలు నిర్వహించారు.

దీపాల పిచ్చయ్య శాస్త్రి జీవితంలో ముఖ్యమైన అంశం ఆయన నిరాడంబర జీవనం. పాండిత్యం ఉన్నప్పటికీ ఆడంబరాలకు దూరంగా ఉండేవారు. విద్యార్థులకు, యువ రచయితలకు ఎల్లప్పుడూ ప్రోత్సాహం అందించేవారు. సాహిత్యాన్ని సమాజోద్ధరణ సాధనంగా ఆయన భావించారు. భాష, సంస్కృతి, సంప్రదాయం పరిరక్షణలో రచయితల బాధ్యత ఎంతో గొప్పదని చెప్పేవారు. తెలుగు సాహిత్య చరిత్రలో అనేక మంది మహనీయులు ఉన్నప్పటికీ భాషా పాండిత్యం, సాహిత్య సేవ, ఉపన్యాస ప్రావీణ్యం, విమర్శా దృష్టి వంటి విభిన్న లక్షణాలను సమన్వయపరచిన వ్యక్తులు కొద్దిమందే. ఆ అరుదైన వర్గంలో దీపాల పిచ్చయ్య శాస్త్రి ఒకరు. ఆయన రచనలు తెలుగు భాషా సంపదను ప్రతిబింబిస్తాయి. ఆయన ఉపన్యాసాలు పాండిత్య ప్రకాశాన్ని తెలియజేస్తాయి. 1983వ సంవత్సరంలో ఆయన భౌతికంగా మనకు దూరమైనప్పటికీ, ఆయన జీవితం భాషాభిమానానికి ప్రతీకగా నిలుస్తుంది.

ప్రస్తుత కాలంలో తెలుగు భాష ఎదుర్కొంటున్న సవాళ్లను పరిశీలించినప్పుడు పిచ్చయ్య శాస్త్రి ఆలోచనలు మరింత ప్రాసంగికంగా కనిపిస్తాయి.

మాతృభాష పట్ల గౌరవం, భాషా శుద్ధి, సాహిత్యాభిరుచి, శాస్త్రీయ దృష్టి వంటి అంశాలను ఆయన ఎత్తిచూపిన విధానం నేటి తరానికి మార్గదర్శకంగా నిలుస్తోంది. తెలుగు భాషను కేవలం సంభాషణ సాధనంగా కాకుండా సంస్కృతి, చరిత్ర, జ్ఞాన సంపదల నిలయంగా చూడాలని ఆయన సూచించారు. దీపాల పిచ్చయ్య శాస్త్రి వంటి మహనీయుల సేవల వల్లే తెలుగు భాష తన సాహిత్య వైభవాన్ని నిలుపుకుంది. పాండిత్య గంభీరతను ప్రజలకు చేరువ చేసిన వారి కృషి భవిష్యత్ తరాలకు ఆదర్శం. తెలుగు సాహిత్య చరిత్రలో ఆయన పేరు శాశ్వతంగా నిలిచిపోతుంది. భాషా సేవకుడిగా, సాహిత్య సంరక్షకుడిగా, శాస్త్రజ్ఞుడిగా ఆయన చేసిన కృషి తెలుగు జాతి సాంస్కృతిక వారసత్వంలో చిరస్మరణీయ అధ్యాయంగా నిలిచిపోతుంది.



-రామ కిష్టయ్య సంగన భట్ల,
9440595494

## ఘనంగా ఎల్లమ్మ, జమదగ్ని కళ్యాణం, సిద్ధోగ మహోత్సవం పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



రాజన్న సిరిసిల్ల, మే 26: (నేటినిజం ప్రతినిధి): మేవేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్‌లో జరుగుతున్న శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి - జమదగ్ని కళ్యాణం, సిద్ధోగ మహోత్సవం కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, భక్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, కౌన్సిలర్లు తూమ్ మధు టైలర్ శ్రీనివాస్ శ్రీనివాస్, తిరుపతి గౌడ్, కో-ఆప్షన్ సభ్యులు దుర్గం విజయం - వర్షారావులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హతను మీరి వైద్యం చేస్తే కఠిన చర్యలు : డిప్యూటీ డీఎంహెచ్ఓ సుమన్ కళ్యాణ్

నల్గొండ, మే 26: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అర్హతను మీరి వైద్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని యాదాద్రి భువనగిరి డిప్యూటీ డీఎంహెచ్ఓ సుమన్ కళ్యాణ్ హెచ్చరించారు. మంగళవారం భూదాన్ పోచంపల్లిలోని బాలాజీ హాస్పిటల్ ను ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల మెహర్ నగర్‌కు చెందిన సిరివంగి రాములు నీరసంతో ఉండగా స్థానిక బాలాజీ హాస్పిటల్‌లో వైద్యురాలు రోగిని పరీక్షించి మోతాదుకు మించి మందులు ఇవ్వడంతో వాంతులు విరేచనాలతో తీవ్ర అస్వస్థకు గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న అధికారులు బాలాజీ హాస్పిటల్ ను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించి ఆమెను అడిగి తెలుసుకున్నారు. ఫస్ట్ ఎయిడ్ మాత్రమే చేయాలని వైద్యురాలికి సూచించారు. ఏం చదివారు, ఎప్పటి నుండి పని చేస్తున్నారు. హాస్పిటల్లో డాక్టర్ ఎవరు, సర్టిఫికెట్లు ఏమున్నాయి.

## రైతాంగ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి

### - ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

### -వేములవాడలో రైతు విజ్ఞాన కేంద్రం ప్రారంభించిన విప్




రాజన్న సిరిసిల్ల, మే 26: (నేటినిజం ప్రతినిధి): రైతాంగ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం వేములవాడ పట్టణంలోని సినారె కళామందిరంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం వేములవాడలోని రాజశ్రీ గార్డెన్స్‌లో నిర్వహించిన సిరిసిల్ల, వేములవాడ డివిజన్ అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్మెంట్ ఏజెన్సీ (ఆత్మ) కమిటీ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నూతన సాంకేతిక పరిజ్ఞానం, నాణ్యమైన విత్తనాలు, పంటల సాగుపై శాస్త్రీయ సూచనలు అందించేందుకు రైతు విజ్ఞాన కేంద్రం దోహదపడుతుందని తెలిపారు. వేములవాడ ప్రాంత రైతాంగానికి ఎంతో ఉపయోగపడే ఈ కేంద్రాన్ని మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రైతుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. రైతు విజ్ఞాన కేంద్రం కోసం 40 ఎకరాల భూమిని కేటాయించామని, జిల్లాకు మంజూరైన ఏకైక కేంద్రం వేములవాడకు రావడం అదృష్టకరమన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, భూసార పరీక్షలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై సాంకేతిక సలహాలు ఒకే చోట అందుబాటులో ఉంటాయని చెప్పారు. గత రెండేళ్లలో వేములవాడ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతు న్నాయని, నేతన్నల కోసం యార్న్ డిపో, మహిళా సంఘాల బలోపేతానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. నియోజకవర్గ పరిధిలో 13 ప్రాంతాల్లో 33/11 సబ్‌స్టేషన్ల మంజూరుతో నాణ్యమైన విద్యుత్ సరఫరా అందిస్తామని పేర్కొన్నారు. రైతుల సంక్షేమంపై కాంగ్రెస్ ప్రభుత్వానికే నిజమైన చిత్తశుద్ధి ఉందని, తడిసిన ధాన్యం ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని భరోసా ఇచ్చారు. రైతులు వరి కొయ్యలను కాల్చకుండా పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వేములవాడ తిప్పాపూర్‌లో శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి సిద్ధోగంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇటీవల కేదార్నాథ్‌లో ప్రమాదవశాత్తు మృతిచెందిన వేములవాడకు చెందిన ఆకుల నరేష్ భౌతికకాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## అక్రమ ఫైనాన్స్ దందాలపై పోలీసుల ఉక్కుపాదం

### -జిల్లా వ్యాప్తంగా ఏకకాల దాడులు..

### -6 కేసులు నమోదు



రాజన్న సిరిసిల్ల, మే 26: రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా వడ్డీ వ్యాపారం, ఫైనాన్స్ నిర్వహిస్తున్న వారిపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. మంగళవారం ఉదయం జిల్లా వ్యాప్తంగా 15 ప్రత్యేక బృందాలుగా ఏర్పడి పోలీసులు ఏకకాలంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో అక్రమ ఫైనాన్స్, వడ్డీ వ్యాపారం నిర్వహిస్తున్న వారిపై 6 కేసులు నమోదు చేసి, రూ.1,39,65,000 విలువ గల వివిధ డాక్యుమెంట్లు, రూ.1,77,000 విలువైన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి గితే తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుని అధిక వడ్డీలతో వేధించే వ్యాపారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితుల్లో అధిక వడ్డీలకు అప్పులు చేసి అనంతరం చెల్లించలేక కుటుంబాలు ఇబ్బందులకు గురికాకుండా జాగ్రత్త పడాలని సూచిం చారు.

ప్రభుత్వ అనుమతులతో చట్టబద్ధ ంగా ఫైనాన్స్ నిర్వహించే సంస్థల నే నమ్మాలని, అనుమతులు లేకుండా అక్రమంగా ఫైనాన్స్ వ్యాపారం నిర్వహిస్తున్న వారి వివరాలను జిల్లా పోలీస్ కార్యాల యానికి లేదా స్థానిక పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచి సమగ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయడమే పోలీస్ శాఖ లక్ష్యమని తెలిపారు. అధిక వడ్డీ రేట్లతో సామాన్యులపై దౌర్జన్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ స్పష్టం చేశారు.

## 22 సంవత్సరాల తర్వాత పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



రాజన్న సిరిసిల్ల, మే 26: (నేటినిజం ప్రతినిధి): షాత్రాజుపల్లి ఉన్నత పాఠశాల లో 2003-2004 సంవత్సరం లో 10 వ, తరగతి చదివిన విద్యార్థులు నేడు ఘనంగా ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వాహినీచారు. ఈ సందర్భంగా చిన్ననాటి స్నేహితులు ఒకచోట చేరి, పాత జ్ఞాపకాలను నేమరువేసుకుంటూ , ఒకరికొకరు యోగ క్షేమాలు తెలుసుకొని, గతంలో గడిపిన ఆనందకరమైన మధుర క్షణాలను గుర్తుచేసుకున్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనం లో తమకు విద్యా బుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. చిన్ననాటి ఆటలు, పాటలు, నృత్యాలతో ఆరోజంతా ఉల్లాసంగా గడిపారు. ప్రతి విద్యార్థి ఉన్నతస్థాయికి ఎదిగినపుడే తల్లిదండ్రులతో పాటు విద్య నేర్పిన గురువులకు గుర్తింపు ఉంటుందన్నారు. అనంతరం ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివా స్, దయానంద్, వెంకటగిరి, రేగుల శ్రీనివాస్ మరియు విద్యార్థులు కమలాకర్, చందనం శ్రీనివాస్, శ్రావన్, కార్తీక్, నజీమా, లావణ్య, స్వప్న, నాగజ్యోతి పాల్గొన్నారు.

## రాంగోపాల్ కుటుంబాన్ని పరామర్శించిన యూనియన్ నాయకులు



రాజన్న సిరిసిల్ల, మే 26: (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, కోరుట్ల పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికేయులు గంగుల రాంగోపాల్ మాతృమూర్తి ఇటీవల అనారోగ్యం తో పరమదించారు. మంగళవారం టియుడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు సయ్యద్ లాయక్ పాషా, సీనియర్ జర్నలిస్ట్, వేములవాడ ప్రధాన కార్యదర్శి సయ్యద్ అలీలు కోరుట్లలోని వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని వ్యక్తపరిచి పరామర్శించారు. ఈ సందర్భంగా మృతురాలి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని ఆ కుటుంబానికి ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, మృతురాలి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com